



ఐదేళ్ల వైసీపీ పాలనలో కౌలు రైతు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాడు. 2014--19 మధ్య ఉన్న కౌలు రైతు కార్డు విధానంలో మార్పులు తీసుకొచ్చి అన్నింటినీ సీసీఆర్‌సీ(క్రాప్ కల్టివేటర్స్ రైట్ కార్డ్) కార్డుతో ముడి పెట్టి కౌలు చేయడమంటేనే గుది బండ అనే స్థాయికి గత ప్రభుత్వం తీసుకొచ్చింది. రుణాలు మొదలుకుని నష్ట పరిహారం వరకు అడుగడుగునా కౌలు రైతు ఐదేళ్ల పాటు నానా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఇకపై తమ ఇక్కట్లకు తెరపడ్డట్టేనని కౌలు రైతాంగం భావించింది. దానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డుల విషయంలో పెద్ద ఎత్తున లక్ష్యాలను విధించి వ్యవసాయ సిబ్బందిని పరిగెత్తించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే కౌలు హక్కు పత్రాలను అన్నదాతలకు అందించడంలో గణనీయమైన పురోగతినే ప్రభుత్వం సాధించింది. పెరిగిన సీసీఆర్‌సీ కార్డుల సంఖ్యతో పాటు కౌలు రైతులకు రుణాలు అందించే విషయంలో బ్యాంకర్లు ఉదారంగా వ్యవహరించాలని ప్రభుత్వం కోరింది. కానీ గత ప్రభుత్వంలో బ్యాంకర్ల తీరు ఎలా ఉందో ఇప్పుడు కూడా దాదాపుగా అదేరీతిన ఉండడంతో కౌలు రైతులకు రుణాల విషయంలో అన్యాయం జరుగుతూనే ఉంది.

కౌలు రైతులపై.. కనికరమేది..?

మరీ తీసికట్టుగా..

బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌సీజన్‌కు గాను రూ.3,750 కోట్లను లక్ష్యంగా అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 5 శాతం వాటా అంటే దాదాపు రూ. 180 కోట్లు కౌలు రైతులకు దక్కాల్సి ఉంది. కానీ దాదాపుగా ఖరీఫ్ ముగింపుకొచ్చింది, రుణ లక్ష్యాలు పూర్తయ్యాయి. కానీ చివరికి కౌలు రైతులు అందుకున్న రుణాలు రూ.18 కోట్లలోపే ఉండడం వారికి రుణాలు అందించే విషయంలో ప్రభుత్వం మారినా పురోగతి లేదనే దానికి సూచికగా కనబడుతోంది. ఇక గతేడాది వైసీపీ ప్రభుత్వంలో అయితే ఇది పది కోట్లలోపే ఉండడం గమనార్హం. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా వేల కోట్లతో వార్షిక రుణ పద్దును బ్యాంకర్లు ప్రకటించారు. తీరా ముగింపు కొచ్చేసరికి గుంటూరు జిల్లాలో రూ.7 కోట్లు, పల్నాడు జిల్లలో రూ.11 కోట్లలోపులనే కౌలు రైతులు అందుకున్న రుణాలు ఉండడం వారి రుణ దీన స్థితికి అద్దం పడుతోంది. మూడు జిల్లాల పరిధిలో గతంతో పోలిస్తే ప్రభుత్వ చొరవ వల్ల సీసీఆర్‌సీ కార్డుల జారీలో గణనీయమైన పురోగతి కనబడింది. కానీ వాటిని ఎక్కువ శాతం మంది కౌలు రైతులు తీసుకునేదే బ్యాంకుల నుంచి రుణాలు వస్తాయనే ఆశతోనే. కానీ అంతిమంగా జారీ చేసిన సీసీకార్డుల్లో 15 శాతం మందికి కూడా రుణాలు అందకపోవడంతో వాటిని తమకు ఇచ్చి లాభమేంటనే ప్రశ్న రైతుల నుంచి వస్తోంది.



బ్యాంకర్ల సహకారం లేకపోవడం వల్లే..

వార్షిక పద్దు ప్రకటించేటప్పుడు ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా కౌలు రైతులకు రుణాలు అందించే విషయంలో సహకరిస్తామని బ్యాంకర్లు చెబుతారు. కానీ ఆచరణలోకొచ్చేసరికి సవాలక్ష నిబంధనలతో వారికి మొండిచెయ్యి చూపించడం వల్లే కౌలు రైతులకు రుణాలు అందించడంలో ఈ దుస్థితి తలెత్తుతోంది. పైగా అందించే ఆ అరకొర రుణాలు కూడా పూర్తిగా వ్యక్తిగత రుణాలు కాకుండా రైతు మిత్ర గ్రూపులు, జాయింట్ ఫార్మర్స్ గ్రూప్స్ కలిస్తేనే రుణాలు ఇంత తీసికట్టుగా ఉంటున్నాయి. అదే ఇక వ్యక్తిగత రుణాల వరకే లెక్క తీస్తే ఈ గణాంకాలు మరీ కుచించుకుపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రభుత్వం కూడా ఆర్థిక సంవత్సరం ఆరంభంలో సమావేశం పెట్టి వార్షిక పద్దు ప్రకటించి రుణాల విషయంలో మార్గనిర్దేశకాలు జారీ చేసి మిన్నకుండడం కూడా బ్యాంకర్ల వైపు నుంచి సహకారం అందకపోవడానికి కారణంగా కనబడుతోంది. నెలకొకసారి కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో సమీక్ష జరిపి బ్యాంకులకు కూడా కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో లక్ష్యాలు నిర్దేశిస్తేనే పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది. లేదంటే ఏటా వార్షిక పద్దులో ఘనంగా కౌలు రైతుల వాటా ఇంతని గొప్పలు చెప్పడం తర్వాత వాటిని పట్టించుకోకపోవడం మొక్కుబడి తతంగంగా నిలిచిపోతోంది.

- ప్రభుత్వం మారినా.... కౌలు రైతుకు సున్నా...!
- రుణాలు అందించడంలో సహకరించని బ్యాంకర్లు
- సీసీఆర్‌సీ కార్డుల జారీతో సరి.. రుణాల మాటేమిటి !
- వేల కోట్లతో ఘనంగా ఖరీఫ్ వార్షిక పద్దు
- కౌలు రైతుల వాటా మాత్రం తీసికట్టుగానే..

బాపట్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వార్షిక పద్దు ఆధారంగా ఖరీఫ్ రుణ లక్ష్యం దాదాపు పూర్తయింది. ఇందులో కౌలు రైతుల వాటా తీస్తే నానాటికీ తీసికట్టు నాగంబొట్టు అన్న చందాన ఉంది తప్పితే వారికి గతంతో పోలిస్తే అదనంగా ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. కౌలు రైతులను ఆదుకోవాలనే ప్రభుత్వ లక్ష్యాలను దెబ్బతీసే విధంగా బ్యాంకర్లు నిబంధనల ఉచ్చు వేసి కౌలు రైతులకు మొండిచెయ్యి చూపిస్తున్నారు. దీనికి తోడు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసి వ్యవసాయ శాఖ మిన్నకుండడం కూడా కౌలు రైతులకు రుణాల విషయంలో ఇప్పటికీ అన్యాయం జరుగుతూనే ఉంది. ఈ ఖరీఫ్ సీజన్ ఆరంభంలో కౌలు రైతుల రుణ వాటాలో ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాలను ఇప్పుడు జారీ చేసిన మొత్తాలను పోలిస్తే రుణాల విషయంలో బ్యాంకుల నిర్లక్ష్యం బయటపడుతోంది. కూటమి ప్రభుత్వం మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నామని కానీ ఇప్పటికీ రుణాల విషయంలో తమకు నిరాశే ఎదురవుతుందని కౌలు రైతాంగం వాపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కౌలు రైతులకు అందించిన రుణాల మీద సమీక్ష జరిపి న్యాయం చేయాలని అన్నదాతలు అభ్యర్థిస్తున్నారు

సీసీఆర్‌సీ కార్డుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ...

కౌలు రైతులకు అందించే సీసీఆర్‌సీ కార్డుల జారీ విషయంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు అందులో విజయవంతమయింది. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన వాటితో పోలిస్తే గణనీయమైన పురోగతిని సీసీఆర్‌సీ కార్డులను కౌలు రైతులకు అందించే విషయంలో సాధించింది. పెట్టుకున్న లక్ష్యాలలో దాదాపు 85 శాతం వరకు కార్డులను కౌలు రైతులకు అందించారు. బాపట్ల జిల్లాలో 1,06,300 సీసీఆర్‌సీ కార్డులను కౌలు రైతులకు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం పెట్టుకోగా ఇందులో ఇప్పటికే 86,500 కార్డులను అందించింది. అదే విధంగా గుంటూరు జిల్లాలో 46,800, పల్నాడులో 66,000 కార్డులను అందించాలని లక్ష్యం పెట్టుకోగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా 85శాతం కార్డులను ఇప్పటికే అందించి గత ప్రభుత్వంతో పోలిస్తే మెరుగైన ఫలితాలను కూటమి ప్రభుత్వం సాధించింది

వార్షిక పద్దు వేల కోట్లలో...

ఏటా ఆర్థిక సంవత్సరం ఆరంభంలో బ్యాంకర్లతో సమావేశమై జిల్లాల వారీగా వార్షికపద్దును ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పద్దుల్లో అగ్రతాంబూలం సేద్యానిదే ఉంటుంది. గత ప్రభుత్వంలో వ్యవసాయ రుణాల్లో కౌలు రైతుల వాటాను నిర్దిష్టంగా నిర్వచించేది కాదు. దీంతో వారి కేటాయింపుల విషయంలోనూ స్పష్టత లోపించేంది. కానీ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వ్యవసాయ రుణాల్లో కౌలు రైతాంగం వాటా 5 శాతం వరకు ఉండాలని, ఇందుకు బ్యాంకర్లు కూడా మానవతా దృక్పథంతో సహకరించాలని ఖరీఫ్ ఆరంభంలోనే తెలిపింది. వాస్తవానికి కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు తీసుకునేదే బ్యాంకు రుణాల వస్తాయనే ఆశతోనే. ఖరీఫ్ ముగింపుకొచ్చింది. బ్యాంకులు తాము రుణ లక్ష్యాలను చేరుకున్నామనే గొప్పలూ చెప్పుకుంటున్నాయి. కానీ కౌలు రైతులకు అందిన రుణ మొత్తాలను పరిశీ లిస్తే విస్తుపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నాం..

రుణాల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా తమను వంచించిందని, కానీ కూటమి ప్రభుత్వంపై తాము ఆశలు పెట్టుకున్నామని కౌలు రైతులు చెబుతున్నారు. సీసీఆర్‌సీ కార్డులు అందించే విషయంలో చొరవ చూపిన ప్రభుత్వం వాటి ద్వారా అందించే రుణాల విషయంలో బ్యాంకర్ల నుంచి పూర్తి స్థాయిలో సహకారం తీసుకోవడంలో విఫలమైందని కౌలు రైతాంగం ఆరోపిస్తోంది. ఇప్పటికైనా జిల్లాల వారీగా కౌలు రైతులకు అందించిన రుణాల లెక్కలను జిల్లా కలెక్టర్లు సమీక్షిస్తే రుణ పద్దు కేటాయింపుల్లో తమకు ఏ స్థాయిలో అన్యాయం జరిగిందో అర్థమవుతుందని కౌలు రైతులు చెబుతున్నారు.

కూటమిలో.. కిలారి చిచ్చు



- అతని అక్రమాలపై అప్పట్లో స్వపక్షంలో, విపక్షంలోనూ రచ్చ
- ఒక వైపు దర్యాప్తు జరుగుతుండగా జనసేనలో చేరే ప్రయత్నం
- కోపంతో రగిలిపోతున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్గీయులు
- కేంద్ర మంత్రి పెమ్మసాని అనుయాయుల్లో విస్మయం
- ఇదే తరహాలో కొందరు బీజేపీలో చేరే ప్రయత్నం
- ఇటువంటి వారి విషయంలో ఆచితూచి వ్యవహరించకపోతే కూటమికి అప్రతిష్ఠ..

గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ళ వైసీపీ పాలనలో సీఎం జగన్‌తో అంటకాగి పొన్నూరు నియోజకవర్గం అడ్డాగా రూ.వందల కోట్ల దోపిడీకి పాల్పడ్డాడనే ఆరోపణలకు గురైన మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కూటమిలో భాగమైన జనసేనలో చేరేందుకు ప్రయత్నిస్తున్నాడనే వార్తలను ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు జీర్ణించుకో లేకపోతున్నారు. అక్రమ క్వారీయింగ్‌లతో రూ. వందల కోట్లు దోపిడీకి పాల్పడ్డాడని అప్పట్లో పొన్నూరు నియోజకవర్గానికి చెందిన సొంత పార్టీ నేతలే రోడ్డెక్కి యాగీ చేసిన విషయం తెలిసిందే. ఆ నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పలు మార్లు కిలారి దోపిడీని సాక్ష్యాలతో ఎండగట్టటం జరిగింది. అక్షరాల 700 ఎకరాల్లో అక్రమ క్వారీయింగ్ అప్పటి ఎమ్మెల్యే రోశయ్య కనుసన్నల్లోనే జరగటాన్ని కేజీఎఫ్ తరహా దోపిడీగా అభివర్ణించారు. ఒక్క అక్రమ క్వారీయింగే కాకుండా ఉద్యోగుల పోస్టింగ్‌ల సమయంలో పెద్ద ఎత్తున డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అంత వరకైతే పర్వాలా ఆ మండలంలో పనిచేసే ఎస్‌ఐలు, సీఐలు, తహశీల్దార్‌లకు సైతం నెల నెలా ఇండెంట్ పెట్టి వసూలు చేశారని కూడా ఏకంగా కొందరు అధికారులే రచ్చకెక్కారు. తన మాట వినని అధికారులను సస్పెండ్ చేయించటం వంటి చర్యలకు కూడా కిలారి పాల్పడినట్లు అప్పట్లో ఆధారాలు ఉన్నాయి. ఏకంగా ఓ తహశీల్దార్‌ను అయితే అతని దోపిడీకి సహకరించటం లేదని సస్పెండ్ చేయించారు. చివరకు ఆయన న్యాయస్థానంలో పోరాటం ద్వారా తిరిగి తన పదవిని కాపాడుకున్నారు. ఒక దశలో పొన్నూరు నియోజకవర్గంలో ఉద్యోగం చేయాలంటే అధికారులు వణికిపోయారు.

రోశయ్య హయాంలో పొన్నూరులో వైసీపీ ఎంత పతనావస్థకు చేరిందంటే ఆ సీటును అడిగేందుకు ఎవరూ ముందుకు రాకపోవటమే తార్కాణం. ఇంత అప్రతిష్ఠ రోశయ్య కూడగట్టుకోవటం మూలంగానే తిరిగి అతనికి సీటిస్తే పొన్నూరులో ఓటమి ఖాయమని భావించే అతన్ని అక్కడ నుంచి తప్పించారు. ఆ తరువాత గుంటూరు ఎంపీగా కూడా ఆయనను తప్పనిసరి పరిస్థితుల్లోనే బరిలోకి దించారు. అతని బావ ఉమ్మారెడ్డి వెంకటరమణకు తొలుత ఎంపీ సీటును ఇవ్వగా ఆయన కొద్ది రోజులకే పోటీకి నిరాకరించి తప్పుకున్నారు. అప్పటికే టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన పెమ్మసాని చంద్రశేఖర్‌ను తట్టుకొని నిలబడేందుకు ఎవరూ ముందుకు రాకపోవటంతో కిలారి రోశయ్యను బరిలోకి దించారు.

జగన్ వత్తిడితో ఎంపీ బరిలోకి దిగిన కిలారి గెలుపు కోసం పదిశాతం కూడా ప్రయత్నం చేయలేదు. గెలవబోమని ముందుగానే నిర్ణయించుకోవటంతో పార్టీ ఇచ్చిన ఫండ్ మినహా సొంత డబ్బు రూపాయి కూడా ఖర్చు చేయలేదు. ఆ ఎన్నికల్లో మూడున్నర లక్షలకు పైగా ఓట్ల తేడాతో ఘోర పరాజయాన్ని కిలారి చవి చూశారు. కొద్ది రోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వాస్తవానికి జగన్ హయాంలో పొన్నూరులో ఆయన చేసిన అరాచకాలపై ప్రస్తుత ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆధారాలతో సహా అధికారులకు అందించటంతో దర్యాప్తు మొదలైంది. ఈ కేసుల నుంచి తప్పించుకునేందుకే ఆయన కూటమి గొడుకు కిందకి చేరే ప్రయత్నం ప్రారంభించాడు. టీడీపీలో ఎటువంటి పరిస్థితుల్లో చేర్చుకోరని నిర్ణయించుకొని తన సామాజికవర్గం నేతల ఆసరాతో జనసేనలో చేరే ప్రయత్నం ముమ్మరం చేశారు. రెండు రోజుల క్రితం జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కూడా మర్యాద పూర్వకంగా కిలారి కలిసి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన తన అనుయాయులతో త్వరలో తాను జనసేనలో చేరబోతున్నట్టు తద్వారా తిరిగి తాము అధికార పార్టీ గొడుగు కిందకు చేరుతున్నామని ధీమా వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా పొన్నూరు నుంచి ఆరు పర్యాయాలు గెలిచి ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్ర వర్గీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పాడి రైతులకు ఎంతో వెన్నుదన్నుగా ఉన్న సంగం డెయిరీని మూత వేయించేందుకు అప్పడు ఎమ్మెల్యేగా ఉన్న కిలారి రోశయ్య చేసిన ప్రయత్నాలను నరేంద్ర అనుయాయులు గుర్తుచేస్తున్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ గాలిలో గెలిచి ఒక్క మారు గెలిచినందుకే రోశయ్య ఎంతో విర్రవీగి టీడీపీ శ్రేణులపై పొన్నూరు నియోజక వర్గంలో ఎన్నో అక్రమ కేసులు బనాయించిన విషయాలను కూడా వారు మరిచిపోలేకపోతున్నారు. అటువంటి నేతను కూటమిలో భాగమైన జనసేనలో చేర్చుకుంటే కలిసి మెలిసి తిరగటం ఎలా సాధ్యమవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. కాగా ఇప్పటి వరకు రోశయ్యను చేర్చుకునే విషయంలో కూటమి నేతలు ఎవరూ కూడా తమ ఎమ్మెల్యే నరేంద్రను సంప్రదించలేదని ఆయన అనుయాయులు వాపోతున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన రోశయ్య పెమ్మసాని చంద్రశేఖర్ చేతిలో ఓడిపోయిన విషయం తెలిసిందే. రోశయ్య చేరికపై పెమ్మసానిని కూడా సంప్రదించలేదని ఆయన అనుయాయులు మండిపడుతున్నారు. సొంత పనిపై అమెరికా వెళ్ళిన నరేంద్ర ఒక వారంలో తిరిగి రానున్నారు. అదే విధంగా ప్రస్తుతం కేంద్ర మంత్రిగా వ్యవహరిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ కూడా సొంత పనిపై అమెరికా వెళ్ళటం జరిగింది. వీరిద్దరూ ఈ నెలాఖరులో రానున్నారు. వచ్చాక వారి స్పందన ఏమిటో వెల్లడి కానున్నది.

రోజుకో దొంగతనం

- చంద్రమౌళి నగర్‌లో మరో భారీ చోరీ
- మూడు రోజుల వ్యవధిలో మూడో దొంగతనం
- విశ్రాంత డీఎస్పీ ఫ్లాట్‌లో లూటీ
- ఎమ్మెల్సీ అప్పిరెడ్డి నివాసం ఉండే అపార్ట్‌మెంట్‌లో చోరీతో కలకలం
- పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు



మెయిన్ డోర్ పగలగొట్టిన దొంగలు

గుంటూరు, సెప్టెంబరు 23: గుంటూరు పట్టాభిపురం పరిధిలో మూడు రోజులు మూడు భారీ చోరీ ఘటనలు వెలుగు చూడడం సంచలనంగా మారింది. అంతే కాకుండా చోరీలు మొత్తం కూడా అపార్ట్‌మెంట్‌లో జరగడం ఆందోళన కలిగించే అంశం. దీనికి తోడు ఎమ్మెల్సీ నివాసం ఉంటున్న అపార్టుమెంట్‌ల్లో జరగడం చర్చనీయాంశమైంది. అంతేగాక విశ్రాంత డీఎస్పీ ఫ్లాట్‌లో జరగడం గమనార్హం. వరుసగా రెండు రోజులు ఎస్వీఎన్ కాలనీలో భారీ చోరీలకు పాల్పడిన దొంగలు ఈసారి చంద్రమౌళినగర్‌ను ఎంచుకున్నారు. వివరాల్లోకి వెళ్తే అదనపు ఎస్పీగా ఉద్యోగ విరమణ చేసిన గడ్డం పెంచలనాయుడు చంద్రమౌళినగర్ 6/1లోని అలంకిత అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నారు. వారి పిల్లలు అమెరికాలో స్థిరపడడంతో స్థానికంగా పెంచలనాయుడు దంపతులు నివాసం ఉంటున్నారు. ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం శనివారం నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం వెళ్లారు. అపార్టుమెంట్‌లోని తన ప్లాటుకు తాళం వేసుకొని భార్యతో ఆయన ఊరువెళ్లారు. సోమవారం వాచ్‌మెన్ ఫోన్‌చేసి ఇంటిలో దొంగతనం జరిగిందని చెప్పడంతో పెంచలనాయుడు దంపతులు సోమవారం సాయంత్రానికి ఇంటికి చేరుకున్నారు. ఇంటిలో పరిశీలించగా 28 సవర్ల బంగారు ఆభరణాలు, రెండు డైమండ్ నెక్లెస్‌లు, ఏడు కిలోల వెండి చోరీకి గురైనట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం అందుకున్న వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్, పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, సీసీఎస్ పోలీసు అధికారులు, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. అ పార్టుమెంట్ వెలుపల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు, అర్థరాత్రి సుమారు రెండుగంటల సమయంలో కారులో ఇద్దరు వ్యక్తులు వచ్చినట్లు గుర్తించారు తొలుత ఎదురు అపార్టుమెంట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా గేటుకు తాళం వేసి ఉండడంతో వారు ఈ అపార్టుమెంట్‌లోకి వచ్చారు. ఆ సమయంలో వాచ్‌మెన్ ఇంట్లో తలుపు వేసుకొని నిద్రపోతున్నాడు. తొలుత అపార్టుమెంట్‌లోని అన్ని ఫ్లోర్లలోకి వెళ్లిన దొంగలు ఒక్కో ఫ్లాట్‌ను చెక్ చేస్తూ వచ్చారు. ఓ ఫ్లోర్‌లో పెంచలనాయుడు తలుపునకు న్యూస్ పేపర్లు గుచ్చి ఉన్నాయి. దీంతో ఇంట్లో ఎవరూ లేరని ఊరు వెళ్లి ఉంటారని నిందితులు గ్రహించారు. ఈ క్రమంలో కిందకు వెళ్లి కారులో ఉన్న ఆయా పరికరాలను తీసుకుని వచ్చి మెయిన్ డోర్ లాక్‌ను పగలగొట్టి, లోనికి ప్రవేశించి అందు బాటులో ఉన్న తాళాలతో బీరువాలో దాచుకున్న 25 సవర్ల బంగారు ఆభరణాలు ఏడు కిలోల వెండి ఆభరణాలు, రెండు డైమండ్ నెక్లెస్‌లు అపహరించుకు పోయినట్లు పెంచలనాయుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఇంటిలో వస్తువులను చెల్లాచెదురుగా పడేసిన దొంగలు

అపార్టుమెంట్లలోనూ భద్రత డొల్లే

ఇప్పటివరకు అపార్టుమెంట్లలో భద్రత ఉంటుందని అందరు భావించారు అటువంటిది తాజాగా చంద్రమౌళి నగర్ లోని అపార్టుమెంట్లలో జరిగిన చోరీ వ్యవహారంతో అపార్టు మెంట్లలోనూ భద్రత డొల్లేనని తేటతెల్లమైంది అంటున్నారు. గతంలో సుమారు 12 ఏళ్ళ క్రితం ఇలాగే గుంటూరు నగరంలో ప్రతిరోజు ఒకటి, రెండు దొంగతనాలకు పాల్పడి ఓ ముఠా పోలీసులకు సవాల్ విసిరింది. అప్పట్లో నెలరోజుల పాటు పెద్ద ఎత్తున దొంగతనాలు జరగడంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. అదే తరహాలో 10 ఏళ్ల తర్వాత తిరిగి వరుస దొంగతనాలు జరుగుతుండటం పోలీస్‌వర్గాలను కలవర పెడుతున్నాయి. ఇదిలా ఉంటే ఎమ్మెల్సీ అప్పిరెడ్డి నివాసం ఉంటున్న అపార్టుమెంట్‌లో జరగడం చర్చనీయాం శంగా మారింది. వీఐపీలు, రాజకీయ నాయకులు, ప్రముఖులు ఉంటున్న అపార్టుమెంట్లలోనూ భద్రత కొరవడం గమనార్హం. నిందితులు దర్జాగా కారులో వచ్చి చోరీ చేసుకుని వెళ్ళడం చర్చనీయాంశమైంది.

42 మంది ఎంపీడీఓలు బదిలీ

పక్క జిల్లాల నుంచి వచ్చిన 16 మందికి ఇక్కడ పోస్టింగ్



గుంటూరు సిటీ, సెప్టెంబరు 23 : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 42 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారుల(ఎంపీడీఓ)ను బదిలీ చేస్తూ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఇంచార్జి సీఈఓ మోహన్ రావు ఉత్తర్వులు జారీచేశారు. ఆదివారం అర్థ రాత్రి కి ఎంపీడీఓల బదిలీల తుదిజాబితా రూపుదిద్దుకుంది. మండలాల వారీగా బదిలీ అయిన ఎంపీడీవోల వివరాలు ఇలా ఉన్నాయి. పీజే విలియమ్స్ (ముప్పాళ్ళ) షేక్ మహబూబ్ సుభాని (చెరుకుపల్లి) జీ కాశియ్య(నకరికల్లు)ఏ శ్రీనివాసరావు (దుగ్గిరాల) ఐ సత్యనారా యణ (పిట్టలవానిపాలెం) కే శివ పార్వతి(ప్రత్తిపాడు) పీ ఉమాదేవి (కారంపూడి) కే నరసింహారావు (కొల్లూరు) కే సమతా వాణి (తాడికొండ) ఎం శోభారాణి (రేపల్లె) వై హనుమారెడ్డి (బెల్లంకొండ) కే సరోజినీ దేవి (రెంటచింత) ఫణి కుమార్ నాయక్ (మాచర్ల)వి విజ యలక్ష్మి (కొల్లిపర) టీ సుగుణమ్మ (మంగళగిరి) పీ పుట్టారెడ్డి (దుర్గి) జి విసత్యనారాయణ (రాజుపాలెం) పి రామకృష్ణ (పెదకూరపాడు) ఎస్ వెంకటేశ్వరరావు (ఫిరంగిపురం) బీ శ్రీనివాస్‌రెడ్డి (సత్తెనపల్లి) జీ చంద్రశేఖర రావు (పొన్నూరు) బీ మారుతి శేషాంబ (అమృతలూరు) బీ శివన్నారాయణ (వేమూరు) కే ప్రభాకర్ రావు (నాదెండ్ల)ఏ దీప్తి(తెనాలి) బీ బాబురావు (బాపట్ల)ఆర్ శ్రీనివాసరావు (పెదకాకాని)కే శ్రీనివాసరావు (అచ్చంపేట) ఎం రమేష్ బాబు (వట్టిచెరుకూరు)ఎస్వీ రమణ (భట్టిప్రోలు) కానూరి శిల్ప (తుళ్లూరు) జి లక్ష్మీదేవి (పెదనందిపాడు) కే లలిత(చేబ్రోలు) టీ చందన (మేడికొండూరు) యుగ కీర్తి (కాకుమాను)ఎస్ సుదీప (చుండూరు) వి హేమలతాదేవి (యడ్లపాడు) టీ పార్వతి (అమరావతి) సీహెచ్ రామచంద్రరావు (పిడుగురాళ్ల)బండ్ల శ్రీనివాసరావు (గుంటూరు రూరల్) తోట వెంకట కృష్ణకుమారి (నరసరావుపేట) ఏ శ్రీనివాసరావు(కర్లపాలెం) ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. బదిలీ ఉత్తర్వు లను ఎంపీడీఓలు సోమవారమే అందుకున్నారు.మరికొందరు వెంటనే విధుల్లో చేరారు.



దివ్యాంగులతో మాట్లాడుతున్న నారా లోకేశ్

- ప్రజాదర్బార్‌లో వినతులు
- సమస్యలు పరిష్కరిస్తానని లోకేశ్ హామీ

పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి

6లో..

ఉమ్మడి పరిశోధనలకు ఒప్పందం



అవగాహన పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 23: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని ఎస్‌ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని సోమవారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ దొంతినేనితో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ ఒప్పందం వలన ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతోపాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్వారీ గుంతలో పడి కౌలు రైతు మృతి



మృతుడు శ్రీను

దుర్గి, సెప్టెంబరు 23: ప్రమాదవశాత్తూ క్వారీ గుంతలో పడి కౌలు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని తేరాలలో చోటుచేసుకుంది. తేరాల గ్రామానికి చెందిన కోడలి శ్రీను (35) మూడెకరాలను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పొలానికి సమీపంలో ఉన్న క్వారీ గుంతలోని నీటిని పొలానికి పెడుతూ ఉంటాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మోటారు క్వారీ నీటిలో మునిగిపోయింది. సోమవారం ఎద్దుల బండికి తాడు కట్టి నీటిలో నుంచి మోటారును బయటకు లాగేందుకు ప్రయత్నిస్తుండగా తాడు తెగిపోవడంతో ప్రమాదవశాత్తూ శ్రీను క్వారీ గుంతలో పడిపోయాడు. స్థానికులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని భార్య కుమారి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుధీర్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి

- ప్రజాదర్బార్‌లో వినతులు
- సమస్యలు పరిష్కరిస్తానని లోకేశ్ హామీ



దివ్యాంగులతో మాట్లాడుతున్న నారా లోకేశ్

తాడేపల్లి, సెప్టెంబరు 23: ఉండవల్లి ప్రజాదర్బార్‌లో 35వ రోజు వినతి పత్రాలు అందించేందుకు, మంత్రి లోకేశ్‌ను కలిసి తమ సమస్యలు చెప్పుకునేందుకు భారీగా ప్రజలు తరలి వచ్చారు. అందరి సమస్యలు విన్న లోకేశ్ పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో అర్జీదారులు సంతృప్తి చెందారు.

మంగళగిరి నియోజకవర్గం నుంచి..

మంగళగిరి నియోజకవర్గం నుంచి మంత్రి లోకేశ్‌కు పలువురు సమస్యలతో కూడిన అర్జీలు అందించారు. దివ్యాంగురాలినైన తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని తాడేపల్లికి చెందిన కె.విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. రెండు కిడ్నీలు పాడైపోయిన తనకు డయాలసిస్ కోసం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన సంగా నాగేంద్రబాబు కోరారు. డిప్లొమో చదివిన తన కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించాలని మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన సూర్యనారయణ విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన పెన్షన్ పునరుద్ధరించాలని మంగళగిరికి చెందిన దాసరి మోజెస్ కోరారు. ఎలాంటి ఆదరణ లేని తనకు ఎయిమ్స్ ఆసుపత్రిలో స్వీపర్ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని నులకపేటకు చెందిన కె.అఖిల విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులు ఇవే..

తాడికొండ నియోజకవర్గం గుండాలపాడుకు చెందిన ముస్లిం మైనార్టీలు తమ గ్రామంలో ఉన్న 15 సెంట్ల మసీదు మాన్యంలో షాదీఖానా నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు. ఏపీ జెన్‌కోలో ఫైర్, సెక్యూరిటీ విభాగాల్లో పని చేస్తున్న మాజీ సైనికులకు రెగ్యులర్ సిబ్బందితోపాటు సమాన వేతనం కల్పించాలని, ఏడాదికి ఉన్న సెలవులను 12 నుంచి 30కు పెంచాలని విజ్ఞప్తి చేశారు. గత 33 ఏళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న తాను ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నానని ఏపీజీఎల్ఐ సొమ్ము ఇప్పించి ఆదుకోవాలని కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన సాయిబాబ కోరారు. 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 ఏళ్ల సర్వీసు పొడిగింపుతో పాటు 12 నెలల వేతనం కల్పించాలని, పదవీ విరమణ తరువాత కనీస పింఛన్ కల్పించాలని 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లా, క్రోసూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బి.రాధాకృష్ణ మంత్రి లోకేశ్‌ను కలిసి శిథిలావస్థలో ఉన్న పాఠశాలకు నూతన భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరి విజ్ఞప్తులు విన్న లోకేశ్ త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. దీంతో అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు



సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న పెదకూరపాడు శ్రీ కాకతీయ జూనియర్, డిగ్రీ కాలేజ అధ్యాపకులు, విద్యార్థులు



సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్నడాక్టర్ విజయలక్ష్మి, ప్రియాంక, అనిల్ కుమార్



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు చెక్కు అందిస్తున్న డాక్టర్ కుర్రా మహేష్

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 23: ఇటీవల వరదల్లో నష్టపోయిన బాధితులకు సహాయార్థం ఐఎంఏ తెనాలి శాఖ సభ్యులు, అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో రూ. 2.51 లక్షల విరాళం ప్రకటించారు. సోమవారం ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు తమవంతుగా సాయం అందించిన ఐఎంఏ తెనాలి శాఖ సభ్యులను సీఎం అభినందించారు. డాక్టర్‌లు జె.విజయలక్ష్మి, వి.పావని ప్రియాంక, కె.అనిల్‌కుమార్, కె.శ్యాంప్రసాద్, పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావ్, తాతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ. లక్ష విరాళం

రేపల్లె, సెప్టెంబరు 23: ఇటీవల వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో రూ.లక్ష విరాళాన్ని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు అందించినట్లు రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ అధ్యక్షుడు డాక్టర్ కుర్రా మహేష్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.అపర్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలను గత ప్రభుత్వం పట్టించుకోలేదు



యాగం నిర్వహిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23: గత ప్రభుత్వం తిరుమలలో భక్తుల మనోభావాలు పట్టించుకోకుండా పాలనా వ్యవహారాలు నడిపిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం యాగం నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా యాగంలో పాల్గొన్నారు. మనోహర్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. టీడీపీ, బీజేపీ జనసేన నాయకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ వందల ఏళ్ల నుంచి తిరుమల పవిత్రతను కాపాడుకుంటూ వస్తున్నారని, వైసీపీ ప్రభుత్వం బాధ్యత లేని వారికి పదవులు ఇచ్చి హిందూ ధర్మానికి భిన్నంగా వ్యవహరించిందన్నారు. లడ్డూ ప్రసాదం తయారీలో ఇష్టారీతిన వ్యవహరించిన వారిని ప్రభుత్వం తగిన విధంగా శిక్షిస్తుందన్నారు. ఏ మతమైనా, ఏ దేవుడైనా పాలకులు ఒకే రీతిలో ప్రవర్తించాలని, గత ప్రభుత్వానికి అహంభావం తప్ప మరొకటి లేదని అన్నారు. ఈ యాగం ద్వారా గతంలో జరిగిన పొరపాట్లను ప్రక్షాళన చేసుకుని ముందుకు పోతామన్నారు. దేవుడిపై భక్తి ఉన్న వారికే తమ ప్రభుత్వం బాధ్యతలు అప్పగిస్తుందన్నారు. టీటీడీ చైర్మన్‌గా వ్యవహరించిన వ్యక్తి చేసిన అక్రమాలపై నివేదికలు తయారవుతున్నాయని, చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ సాయి, డైరెక్టర్లు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోల్ ప్రక్షాళన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- వైసీపీ భక్త బృందాన్ని బయటకు పంపిన బ్రహ్మయ్య

గుంటూరు సిటీ, సెప్టెంబరు 23: పంచాయతీరాజ్ ఇంజనీర్ల బదిలీల్లో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశారు. పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య గత ప్రభుత్వ తాబేదార్లుగా ఉన్న అధికారులకు పెద్ద ఎత్తున స్థానచలనం కల్పించారు. బదిలీల ప్రక్రియ మొదలైన తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ ప్రజాప్రతినిధులను ఇబ్బంది పెట్టిన పలువురు ఇంజినీరింగ్ అధికారులు చురుగ్గా పావులు కదిపారు. యూనియన్ ను అడ్డం పెట్టుకుని గుంటూరులోని క్వాలిటీ కంట్రోల్ విభాగంలోనే తిష్ట వేసేందుకు ప్రయత్నం చేశారు. వారి ప్రయత్నాలను 'ఆంధ్రజ్యోతి' 'నాడు కక్ష కట్టి.. నేడు కదలరంట' అనే శీర్షికతో వెలువడిన కథనం ద్వారా బట్టబయలు చేసింది. దీంతో అప్రమత్తమైన పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు యూనియన్ లేఖలను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్హత లేని వారిని వేరే జిల్లాలకు బదిలీ చేశారు. టీడీపీ ప్రజాప్రతినిధులను ఇబ్బందులు పాలు చేసిన ఇంజినీరింగ్ అధికారులు వేరే జిల్లాలకు వెళ్లిపోయారు. అప్పటి మంత్రి భర్తకు స్నేహితుడిగా చెప్పుకునే అధికారిని, రాజ్యసభ ఎంపీ క్లాస్‌మేట్‌ని, ఇతర వైసీపీ అనుకూల జేఈలను ఇతర జిల్లాలకు పంపారు. పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య బదిలీల ప్రక్రియలో పూర్తిగా మార్గదర్శకాలు అమలు చేయటంతో యూనియన్ ముసుగులో ఇక్కడే ఉండాలని చూసిన అధికారుల ఆటలు సాగలేదు. గుంటూరు జోన్ పరిధిలో 183 మంది పంచాయతీరాజ్ ఆయా స్థాయిల్లోని ఇంజినీర్లు బదిలీ అయ్యారు.

దొడ్లేరు సీజీజీబీ ఎదుట రైతుల ధర్నా



క్రోసూరు, సెప్టెంబరు 23: మండలంలోని దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో 14 నెలల క్రితం గోల్డ్ అప్రైజర్ చేతివాటం కారణంగా మాయమైన బంగారాన్ని తమకు ఇప్పించటంలో బ్యాంక్ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం బాధిత రైతులు బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఐదు వందల మంది రైతులకు చెందిన రెండు కిలోలకు పైగా బంగారం మాయమైతే ఇప్పటి వరకు 270 మంది రైతులకు మాత్రమే సమస్య పరిష్కారమైందని రైతులు తెలిపారు. ఈ 14 నెలల్లో అనేకసార్లు బ్యాంక్ అధికారులతో మాట్లాడామని, ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు నచ్చ చెప్పిన మీదట ఆగామని రైతుల తరుపున కౌలు రైతు మండల సంఘం అధ్యక్షుడు తిమ్మిశెట్టి హనుమంతరావు తెలిపారు. బ్యాంక్‌కు తాళాలు వేసి బ్యాంక్ ఎదుట బైఠాయించి రైతులు నినాదాలు చేశారు. బ్యాంక్ మేనేజర్ శివ శంకర్, క్రోసూరు ఎస్‌ఐ నాగేంద్రబాబు రైతులను శాంతింప చేయటానికి ప్రయత్నించారు. బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ 270 మంది రైతులకు నష్ట పరిహారం చెల్లించామని, మరో 40 మందికి చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇంకా 150 మందికి చెందిన బంగారాన్ని రికవరీ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఎస్‌ఐ నాగేంద్రబాబు మాట్లాడుతూ బాధ్యుడైన నాగార్జునను రైతుల వద్దకు తీసుకువస్తామని హామీ ఇచ్చిన మీదట ఆందోళన విరమించారు. రైతు సంఘం మండల కమిటీ నాయకులు దగ్గు నటరాజు, బంగారం రైతుల పోరాట కమిటీ నాయకులు ఈశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

షూటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు కేఎల్‌యూ విద్యార్థులు



ముఖేష్



ఉమామహేష్

తాడేపల్లి, సెప్టెంబరు 23: ఈ నెల 26 నుంచి అక్టోబరు 6 వరకు పెరు దేశంలోని లిమాలో జరగనున్న షూటింగ్ జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు నేలవల్లి ముఖేష్, మద్దినేని ఉమామహేష్ ఎంపికయ్యారని వర్సిటీ క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల ఈ పోటీల్లో పాల్గొనే భారత జట్టును ప్రకటించిందన్నారు. గుంటూరు శ్రీనగర్ 4వ లైనుకు చెందిన ముఖేష్ కేఎల్‌యూలో సీఎస్ఐటీ 3వ ఏడాది చదువుతుండగా, ఉమామహేష్ 4వ సంవత్సరం చదువుతున్నాడని తెలిపారు. గత ఆర్నెల్లు జరిగిన ఎంపిక ప్రక్రియలో భాగంగా విశేష ప్రతిభ కనబరిచిన ముఖేష్ మొత్తం ఆరు విభాగాల్లో జాతీయ జట్టుకు ఎంపికై పది పతకాలకు పోటీ పడనున్నట్టు తెలిపారు. మద్దినేని ఉమామహేష్ పది మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడని చెప్పారు. వీరిద్దరూ ఒలింపిక్ పతక విజేత గగన్ నారంగ్‌కు చెందిన గన్ ఫర్ గ్లోరీ షూటింగ్ అకాడమీలో అంతర్జాతీయ కోచ్‌లతోపాటు సాయ్ శిక్షకుల పర్యవేణలో శిక్షణ పొందుతున్నారని, సోమవారం తెల్లవారుజామున ముంబయి నుంచి పెరు దేశానికి వెళుతున్నట్టు చెప్పారు.

ఏఎన్‌యూ ఇన్చార్జి ఫైనాన్స్ అధికారిగా వెంకటేశ్వర్లు

పెదకాకాని, సెప్టెంబరు 23: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్చార్జి ఫైనాన్స్ అధికారిగా డిప్యూటీ రిజిస్ట్రార్ ఎ.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు ఆదేశాలు జారీ చేశారు. వాటి ప్రకారం ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం వీసీ గంగాధర రావు వెంకటేశ్వర్లకు నియామక ఉత్తర్వులు అందజేశారు. వికాస కార్యదర్శి కావూరి శ్రీనివాసరావు, జాయింట్ రిజిస్ట్రార్ సత్యవతి, సూపరింటెండెంట్ భాను ప్రసాద్, ఇంజనీర్ కుమార్ రాజా, సీఈ ఆలపాటి శివప్రసాదరావు, నేలపాటి నాగేశ్వరరావు, వై. రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఏసీఈ నియామకం

పెదకాకాని, సెప్టెంబరు 23: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి సంబంధించి అదనపు పరీక్షల నియంత్రణాధికారి (ఏసీఈ)గా ఎన్.యోబు నియమితులయ్యారు. సోమవారం ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ రిజిస్ట్రార్‌గా వర్సిటీ అభివృద్ధిలో తన వంతు కృషి చేసిన యోబు దాదాపు అన్ని విభాగాల్లో పని చేశారు. రెక్టర్ ఆచార్య రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, వికాస కార్యదర్శి కావూరి శ్రీనివాసరావు, జాయింట్ రిజిస్ట్రార్ సత్యవతి, భానుప్రసాద్, నేలపాటి నాగేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, వై.రాధాకృష్ణ తదితరులు యోబుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్టీసీలో అధికారుల బదిలీలు

గుంటూరు, సెప్టెంబరు 23: ప్రభుత్వ రంగ సంస్థ ఆర్టీసీలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. డిపో మేనేజర్లతోపాటు జిల్లా అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ (సీఎమ్ఈ)గా వ్యవహరిస్తున్న నర్రా శ్రీనివాసరావును విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ డిప్యూటీ చీఫ్ టెక్నికల్ మేనేజర్ (సీటీఎమ్)గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుంటూరు బస్టాండ్ కార్గో పార్శిల్ సంస్థ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఏటీఎమ్)గా వ్యవహరిస్తున్న ఐ.సురేష్‌బాబును ఇన్‌ఛార్జిగా నియమించారు. అలానే మాచర్ల డీఎమ్ పిచ్చయ్యను మంగళగిరి డిపో మేనేజర్‌గా, వినుకొండ డీఎమ్ బి.కోటేశ్వరరావు నాయక్‌ను పిడుగురాళ్ల డిపోకు, నరసరావుపేట డీఎమ్‌గా వ్యవహరిస్తున్న బి.వీరాస్వామిని మాచర్ల డిపోకు, నందికొట్కూరు డీఎంగా పనిచేస్తున్న కె.నాగేశ్వరరావును వినుకొండకు, కనిగిరి డీఎమ్ శ్రీమన్నారాయణను బాపట్ల డిపోకు బదిలీ చేశారు. బాపట్ల జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) గా గుంటూరు డీపీటీవో రవికాంత్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ బదిలీల్లోనైనా బాపట్ల డీపీటీవోను నియమిస్తారని అధికారులు భావించినా తాజా జాబితాలో ఆ ఊసే లేకపోవటం చర్చనీయాంశంగా మారింది.

గుంటూరు మీదగా భారత్ గౌరవ్ రైలు

- అక్టోబరు 17 నుంచి 26 వరకు ఉత్తర భారత యాత్ర
- ఆగ్రా, మథుర, వైష్ణోదేవి, హరిద్వార్, రిషికేష్‌ల సందర్శన

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తొలిసారిగా భారత్ గౌరవ్ రైలుని గుంటూరు మీదగా నడిపేందుకు ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) నిర్ణయించింది. ఉత్తర భారత దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల సందర్శన కోసం ఈ రైలుయాత్రని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నది. అక్టోబరు 17న ప్రారంభమయ్యే ఈ తీర్థయాత్ర 26వ తేదీన ముగుస్తుంది. విజయవాడ నుంచి ప్రారంభమై గుంటూరు, సికింద్రాబాద్‌ల మీదగా ఉత్తర భారత దేశంలో ప్రసిద్ధిగాంచిన పర్యాటక ప్రదేశాలైన ఆగ్రా, మధుర, వైష్ణోదేవి(కాత్రా), హరిద్వార్, రిషికేష్‌ల సందర్శన చేసుకొని తిరిగి గుంటూరుకు చేరుకుంటుంది. ఈ యాత్రకు ఎస్‌సీజెడ్‌బీజీ31 కోడ్‌ని ఐఆర్‌సీటీసీ కేటాయించింది. రాత్రివేళల్లో బస చేసేందుకు తరగతి ప్రయాణాన్ని బట్టి నాన్‌ఏసీ, ఏసీ, రోడ్డు రవాణకు కూడా ఇదే విధానాన్ని అందుబాటులోకి తీసుకుస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. దేశంలో పర్యాటక రంగాన్ని వృద్ధి చేసేందుకు రైల్వే శాఖ ఐఆర్‌సీటీసీకి భారత గౌరవ యాత్ర రైళ్లను కేటాయిస్తుంది. ఇప్పటి వరకు ఏ రైలు అయినా సికింద్రాబాద్ - కాజీపేట - విజయవాడ, చెన్నై - ఒంగోలు - విజయవాడ మీదగానే ప్రయాణిస్తున్నాయి. తొలిసారిగా గుంటూరు మీదగా ఉత్తర భారతదేశానికి యాత్రని ప్రకటించింది. పైన పేర్కొన్న పుణ్యస్థలాల సందర్శన కోసం స్లీపర్‌క్లాస్ అయితే రూ. 17,940, ఏసీ త్రీటైర్ అయితే రూ. 29,380, ఏసీ టూటైర్ అయితే రూ. 38,770గా ఛార్జీలను నిర్ణయించింది. స్లీపర్ క్లాస్ ప్రయాణికులకు నాన్ ఏసీలో గదులు, రవాణ సదుపాయాలు కల్పిస్తారు. యాత్ర పూర్తి వివరాల కోసం ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు ప్రవీణ్-92814,95848, బాలాజీ-9281030714లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

రాజ్యలక్ష్మికి అవుట్ స్టాండింగ్ లీడర్‌షిప్ లెగసీ అవార్డు



మంగళగిరి, సెప్టెంబరు 23: విజయనగరంలోని గురజాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.రాజ్యలక్ష్మికి కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపిటెన్సీస్ (సీఎస్‌సీ ఇండియా) నీతి ఆయోగ్ అవుట్ స్టాండింగ్ లీడర్‌షిప్ లెగసీ అవార్డును ప్రకటించింది. జాతీయ ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా జరిగిన వేడుకల్లో వర్చువల్‌గా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఇంజినీరింగ్ విద్యా రంగంలో విశేష సేవలందించినందుకుగానూ రాజ్యలక్ష్మి ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా సీఎస్‌సీ ఇండియా సీనియర్ లెర్నింగ్ కన్సల్టెంట్ వై.రామమోహనరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యా రంగంలో రాజ్యలక్ష్మి అందించిన దీర్ఘకాలిక సేవలను ప్రశంసించారు. ఆమె అంకితభావం, దార్శనికత, నాయకత్వం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వర్సిటీ అనేక విభాగాల్లో ప్రగతి సాధించిందన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.జయసుమ, డైరెక్టర్లు, అధ్యాపకులు, సిబ్బంది అవార్డు అందుకున్న రాజ్యలక్ష్మికి అభినందనలు తెలిపారు.

డీసీ మహేశ్వర్ రెడ్డిపై బదిలీ వేటు

- నూతన డీసీగా కేబీ శ్రీనివాసు నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 23: వైసీపీలో అంటకాగిన దేవాదాయ శాఖ అధికారులపై ఎట్టకేలకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఆ శాఖలో ఉన్న గుంటూరు డిప్యూటీ కమిషనర్ బి.మహేశ్వర్ రెడ్డిని బదిలీ చేస్తూ గొల్లపూడిలోని హెడ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ప్రకాశం జిల్లా మాలకొండ నరసింహస్వామి దేవస్థానం ఈవోగా ఉన్న కె.బి.శ్రీనివాసరావును గుంటూరు డీసీగా నియమించారు. ఆంధ్రజ్యోతి గుంటూరు జిల్లా సంచికలో 'వైసీపీతో అంటకాగినా.. అందలమే' శీర్షికన కథనం వెలువడిన విషయం విదితమే. స్పందించిన రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుంటూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీసీ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న శ్రీధర్ రెడ్డిని ఒంగోలు బదిలీ చేశారు. గతంలో 2014 నుంచి 2019 వరకు గుంటూరు జిల్లా దేవాదాయ శాఖ ఏసీగా కేబీ శ్రీనివాసరావు పని చేశారు. ఆ కాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత కీలకంగా భూ సేకరణలో ఆయన ఎంతో సహకారం అందించారు. అప్పుడు దేవాదాయ శాఖ భూముల పరిరక్షణలో ఆయన విశేషంగా కృషి చేసినట్లు అప్పటి ప్రభుత్వం ఘనంగా ఉత్తమ సేవ పథకం కూడా అందజేసింది.

విశ్వవిద్యాలయాల విద్యార్థుల సమ్మేళనం

పెదకాకాని, సెప్టెంబరు 23: గుంటూరులో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో అక్టోబర్ 27, 28 తేదీలలో జరగబోయే రాష్ట్ర విశ్వవిద్యాలయాల విద్యార్థుల సమ్మేళనం గోడపత్రికలను సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి సూళ్లూరు జయచంద్ర చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ రెండు రోజులు పాటు జరిగే ఈ సమ్మేళనంలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టంపైన అలాగే నూతన విద్యా విధానం ఇంప్లిమెంటేషన్‌పైన చర్చించేందుకు వేదికగా ఉండబోతుందన్నారు. యూజీసీ, విద్యాశాఖ మంత్రిత్వ అధికారులు పాల్గొంటారని తెలియజేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 23: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,035 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 36,950 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు. పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతున్నాయని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

45,672 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 49,763 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,672 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 22,242 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16800
నెంబరు. 5	10000	14500
273	9500	14000
341	9000	16000
4884	13500	13700
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18800
బ్యాడిగి	10000	15000
దేవనూరు డీలక్స్	9000	16000
తెల్లకాయలు	5000	12000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	9000	17000
నెంబరు. 5	10800	15000
273	8500	8500
341	10700	17000
4884	10000	13800
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9500	18600
బ్యాడిగి	10000	15000
దేవనూరు డీలక్స్	11000	16000
తెల్లకాయలు	5000	10500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఇచ్చిన మాట నిలబెట్టుకునే కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే నసీర్



పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్, సజీల

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం 57వ డివిజన్‌లో సోమవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' మూడోరోజు ప్రచార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే జరిగిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజ లకు వివరించారు. అనంతరం సభ నిర్వహించి ప్రజల అర్జీలను స్వీకరించారు. వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, వీ.కిరణ్, సిహెచ్ కనకారావు, పీ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు ఫ్రంట్ లైన్ వారియర్స్

తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పరిసరాలను పరిశుభ్రం చేసే పారిశుధ్య కార్మికులు మన ఆరోగ్యాన్ని కాపాడే ఫ్రంట్ లైన్ వారియర్స్ అని ఎమ్మెల్యే నసీర్ కొనియాడారు. గుంటూరు ఆనంద పేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో సోమవారం పారిశుధ్య కార్మికుల కోసం నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో, విజయవాడ వర దల సమయంలో వారి సేవలు మరువలేనివని, వారికి చీరలు, బట్టలు, చేతి గ్లౌజులు, టోపీలు, బూట్లు త్వరలో అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా హెల్త్ కోఆర్డినేటర్ డాక్టర్ మజీద తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో 'ఇది మంచి ప్రభుత్వం'

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 23: స్థానిక 15 వార్డులో సంగడిగుంట, ఐపీడీ కాలనీలో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. కార్యక్రమంలో 15వడివిజన్ టీడీపీ అధ్యక్షుడు సూరె శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ మల్లెంపూడి శ్రీనివాసరావు, వజ్జా లక్ష్మి, పొందూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి పాలనపై సంతృప్తి: ఎమ్మెల్యే గళ్లా మాధవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి వందరోజుల పాలనపై ప్రజల్లో సంతృప్తి వ్యక్త మవుతోందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యా లయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా స్వామ్యం చాలా విలువైందని, నియంతలకు ఇక్కడ చోటు లేదని, ఎన్నికల్లో ప్రజలు జగన్ రెడ్డికి గట్టిగా బుద్ధిచెప్పారని అన్నారు. నేడు ఎన్డీయే కూటమి అధికారంలోకి రావటంతో ప్రజలు, ప్రజా సంఘాలు, మీడియా ఇతర రాజకీయ పార్టీలు స్వేచ్ఛా వాయులు పీల్చుకుంటున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజి సమస్యలు లేకుండా చూడటమే తన లక్ష్యమని ఆమె చెప్పారు.

రాక్షస పాలన పోయి రామరాజ్యం వచ్చింది: కోవెలమూడి



'మంచి ప్రభుత్వం' స్టిక్కర్లు అందజేస్తున్న కోవెలమూడి రవీంద్ర

గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాక్షస పాలన పోయి రామ రాజ్యం వచ్చిందని గుంటూరు నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కోవెల మూడి రవీంద్ర (నాని) అన్నారు. సోమవారం 37వ డివిజన్‌లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వ హించారు. 'మంచి ప్రభుత్వం' స్టిక్కర్‌ను ఇంటింటికి అంటించారు. రవీంద్ర మాట్లాడుతూ తమకు అన్ని విధాల సౌకర్యంగా ఉందని, అన్ని ధరలు కూడా అందుబాటులో ఉన్నాయని ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కే.హనుమంతరావు. కార్పొరేటర్ ఈ.వరప్రసాద్, 37వ డివిజన్ నాయకులు వజ్జా సూర్యం, రామకృష్ణ పాల్గొన్నారు.

జిల్లా ఉప రవాణా కమిషనర్‌గా కే.సీతారామిరెడ్డి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 23: జిల్లా ఉపరవాణా కమిషనర్(డీటీసీ)గా కే.సీతారామిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం విజయవాడ రవాణా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న షేక్ కరీం ఏలూరుకు బదిలీ అయ్యారు. నరసరావుపేటలో మోటారు వాహన తనిఖీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సత్యానారాయణ ప్రసాదు పదోన్నతిపై గుంటూరు ఆర్టీవోగా బదిలీ అయ్యారు. ఏలూరులో ఆర్టీవో విధులు నిర్వహిస్తున్న కే.శ్రీహరిని తెనాలి ఆర్టీవోగా బదిలీ చేశారు. జాయింట్ రవాణా కమిషనర్‌గా విధులు నిర్వ హిస్తున్న కే.కృష్ణవేణీ తిరుపతికి బదిలీ కాగా, ప్రస్తుతం విజయవాడ, జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్.శివరామ్‌ప్రసాదు గుంటూరుకు బదిలీ అయ్యారు.

గుంటూరు పశ్చిమ తహసీల్దారుగా వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరణ

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 23: గుంటూరు పశ్చిమ తహసీల్దార్‌గా కే.వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన ప్రకాశం జిల్లాలో తహసీల్దార్‌గా పని చేశారు. తాజాగా బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లాకు కేటాయించగా, గుంటూరు పశ్చిమ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించాలని ఆయనకు జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు.


గుంటూరు రూరల్ మండల ఎంపీడీవోగా బండి శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 23: గుంటూరు రూరల్ మండల ఎంపిడీవోగా బండి శ్రీనివాసరావు నియమితులైయ్యారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు మండల ఎంపిడీవోగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇక్కడికి బదిలీయ్యారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎస్.ఆదినారాయణరావు నెల్లూరుకు బదిలీ అయ్యారు.

స్పెషల్ పీపీ బ్రహ్మారెడ్డి రాజీనామా ఆమోదం

గుంటూరు(లీగల్), సెప్టెంబరు 23: రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, డెకాయిట్లా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి రాజీనామాను ఆమోదిస్తూ రాష్ట్ర హోం శాఖ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో బ్రహ్మారెడ్డి స్పెషల్ పీపీగా నియమితులయ్యారు. ఆ పదవితో పాటు ఆయన మూడవ అదనపు జిల్లా కోర్టు, జిల్లా ప్రధాన న్యాయస్థానాలకు కూడా కొంతకాలం ఇన్‌ఛార్జి పీపీగాపనిచేశారు. ఓ మహిళా న్యాయవాది తన పట్ల బ్రహ్మారెడ్డి అసభ్యంగా ప్రవర్తించారని ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ అంశం పై గుంటూరు బార్ అసోసియేషన్‌లో కూడా సర్వసభ్య సమావేశం జరిగింది. అయితే, ఆ మహిళా న్యాయవాది ఫిర్యాదుపై విచారణ జరిపిన ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ గత ఆగస్టు 16న రాష్ట్ర హోం శాఖకు నివేదిక అందజేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో బ్రహ్మారెడ్డి కూడా ఈ నెల 2న తన స్పెషల్ పీపీ పదవికి రాజీనామా సమర్పించాడు .మహిళా న్యాయవాది ఆరోపణలపై ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ పంపిన నివేదికతో పాటు బ్రహ్మారెడ్డి తన రాజీనామా లేఖను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ముగిసిన రాష్ట్ర పికిల్ బాల్ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 23: ఏపీ పికిల్ బాల్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గుంటూరు, హనుమయ్యనగర్‌లోని వివివి హెల్త్ హబ్‌లో జరిగిన ఏపీ స్టేట్ పికల్ బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా వివి హెల్త్ హర్ట్ డైరెక్టర్ టి అరుణ్‌కుమార్, రాష్ట్ర పికిల్ బాల్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పీ.వంశీ, ఎన్.శ్రీధర్, ప్రముఖ న్యాయవాది చిగురుపాటి రవీంద్ర బాబు, టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

● **ఫలితాల వివరాలు**

అండర్- 14 బాలుర విభాగంలో విన్సెంట్ (విన్నర్), దిశాంత్ (రన్నర్), ఓపెన్ సింగిల్స్‌లో పీ.ఆనంద్ కుమార్ (విన్నర్), కుష్వంత్ సాయి(రన్నర్), 35 ప్లస్ పురుషుల విభాగంలో సిహెచ్ ఫణి (విన్నర్), ఎన్ శ్రీధర్(రన్నర్), 50 ప్లస్ పురుషుల విభాగంలో సిహెచ్ శివ (విన్నర్)గోగినేని శ్రీనివాసరావు (రన్నర్), మహిళల విభాగంలో శ్రీయనశా (విన్నర్), తనిసీ సాయి(రన్నర్)గా నిలిచారు.

ఘనంగా ఆదర్శ కుటుంబాల ఆత్మీయ వేడుకలు



దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 23 : ప్రేమకు కులమతాలు అడ్డు కావని నిరూపించిన 50కి పైగా కుటుంబాలు ఒకచోట చేరడం వసుధైక సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎన్జీవో కళ్యాణ మండపంలో ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో ఆదర్శ దంపతులు ఆషా కరుణ్ ,రాజేంద్రప్రసాద్ షష్టిపూర్తి వేడు కలు వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల మధ్య వైభవంగా జరిగాయి. సామాజిక అంతరాలు వీడి వసుధైక కుటుంబాలుగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరెడ్డి అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీ నారాయణ, డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కార విధానంతో సంతృప్తి చెందాలి

● కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 264 అర్జీలు

● అర్జీల పరిష్కారంలో వెనుకబడ్డ పారిశుధ్య, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, డీపీవో విభాగాలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవతేజ తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 23: ఫిర్యాదులను పరిష్కరించే విధానం అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేసేలా ఉండాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. గత నెల నుంచి ఈ కార్యక్రమం నిర్వహించకపోవడంలో అర్జీదారులు పోటెత్తారు. జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి 264 అర్జీలు అందాయి. జేసీ భార్గవ తేజ, డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎమ్.గంగరాజు, ఆర్డీవో పీ.శ్రీకర్, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాధ్‌తో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సిటిజన్ సంతృప్తి జిల్లాలో 77 శాతం ఉందన్నారు. అర్జీల పరిష్కారంలో పారిశుధ్య, పంచాయితీ రాజ్, ఇంజనీరింగ్, డీపీవో విభాగాలు వెనుకబడి ఉన్నాయని అన్నారు. జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారంలో సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సీపీవో శేషశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, డీఎస్‌వో కే.పద్మ, ఎల్‌డీఎమ్ మహిపాల్‌రెడ్డి, పంచాయితీ రాజ్ ఎస్ఈ జీ.బ్రహ్మాయ్య పాల్గొన్నారు.

● పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలని కోరుతూ వలంటీర్లు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్ల సంఘం ఉపాధ్యక్షుడు తాడిశెట్టి భవానీ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు పదివేల మంది వలంటీర్లు పనిచేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయిందని, ఇంతవరకు జీతాలు అందలేదని తెలిపారు. కొన్నిచోట్ల బిల్లులు వేస్తున్నారని, కొన్నిచోట్ల వేయడం లేదని, అసలు తాము కొనసాగుతున్నామో లేదో అర్థం కావడంలేదని వాపోయారు. వలంటీర్లుగా పని చేస్తున్న వారిలో వికలాంగులు, వితంతువులు, నిరుపేదలు కూడా ఉన్నారని, ప్రభుత్వం స్పందించి పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరారు. హామీ మేరకు తమను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

● ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనప్పటికీ రెండేళ్లుగా పరిహారం అందలేదని బాధితురాలి తల్లి దోమల మరియమ్మ అర్జీ అందజేశారు. 2022లో గోరంట్లలో అత్తింటి వేధింపుల కారణంగా తన కుమార్తె తురగ రేణుక ఆత్మహత్యకు పాల్పడగా, నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో 2022లో అట్రాసిటీ కేసు నమోదు చేశామని తెలిపారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని, తన కూతురుకి ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారని , పరిహారం విడుదల చేయాలని కోరారు.

● జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు.బీఆర్ స్టేడియం ఎదురుగా నిర్మాణం పూర్తి అయిన కోడిగుడ్డు సత్రం హాస్టల్లో విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాలని,పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, ఎయిడెడ్ కాలేజీల్లో అధిక ఫీజులు నియంత్రించాలని, బీసీ హాస్టల్స్‌లో మెనూ సక్రమంగా అమలు చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణను అరికట్టాలని, 'తల్లికి వందనం' వెంటనే ప్రారంభించి నిధులు విడుదల చేయాలని, జీవో 77 రద్దు చేయాలని తదితర డిమాండ్లపై వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ గుంటూరు నగర అధ్యక్ష కార్యదర్శులు ఏ.యశ్వంత్,వేస్క్.సమీర్, నాయకులు దాసు, సురేష్ పాల్గొన్నారు.

● మాదిగ పల్లె వద్ద ఉన్న తుంగభద్ర డ్రైనేజీ కాలువపై వంతెన నిర్మాణాన్ని వెంటనే చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని, దుగ్గిరాల ప్రాంత వాసులు అర్జీ అందజేశారు. 2019 మరమ్మతుల పేరుతో వంతెన కూల్చివేశారు కానీ, పునర్నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దాదాపు రెండేళ్లుగా కాలయాపన జరుగుతోందని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జాప్యానికి కారణమైన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, గ్రామానికి, మాదిగ పల్లెకు ఏకైక వారధి అయిన ఈ వంతెన నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో చిలువూరు నాగరాజు, రవి, నాగయ్య, కీర్తి ఉన్నారు.

● అవకతవకలకు పాల్పడ్డ వెలుగు యానిమేటరు మల్లీశ్వరీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రత్తిపాడు మండలం గొట్టిపాడుకి చెందిన డ్వాక్రా మహిళలు అర్జీ అందజేశారు. ఆంధ్రా గ్రామ సమైక్య సంఘంలో 24 గ్రూపులు ఉన్నాయని, కానీ 2013 నుంచి 2024 వరకు తాము కట్టిన సభ్యత్వ రుసుం బ్యాంకులకు చెల్లించలేదని, సభ్యత్వాలకు చెందిన రుసుం దాదాపు రూ.7 లక్షల 50 వేల వరకు ఉండాలని, కానీ కేవలం రూ.56 వేలు మాత్రమే ఉన్నాయని గ్రూపు సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రుణాల మంజూరు విషయంలో అనేక అవకతవకలను పాల్పడ్డ మల్లీశ్వరీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రత్నకుమారి, శైలజ, జ్యోతి, రాణి, సుభాషిణి ఉన్నారు.

అర్జీలను క్షేత్రస్థాయిలో అధికారులు నేరుగా పరిశీలించాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు



కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించి, వాకర్స్‌తో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 23: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఇస్తున్న అర్జీలను క్షేత్రస్థాయి అధికారులు నేరుగా పరిశీలించి, అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ప్రజల నుండి అర్జీలను ఆయన తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ ప్రతి అర్జీ సమగ్రంగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా, నాణ్యమైన పరిష్కారానికి విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జీఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, ఆయా సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని అన్నారు. పీజీఆర్ఎస్ కు 58 ఫిర్యాదులు అందినట్లు చెప్పారు.వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తొలుత నగరంలో జరుగు తున్న 'ఇది మంచి ప్రభుత్వం' అమలును నోడల్ అధికారుల వారీగా సమీక్షించారు. కార్య క్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్‌ఓ మధు సూదన్, ఉపాసెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు జవాబుదారీగా ఉండాలి

జీఎంసీ ఉద్యోగులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, కేటాయించిన విధుల్లో నిర్దేశిత సమయపాలన పాటించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలను ఆకస్మిక తనిఖీ చేసి, విభాగాధిపతులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల నుండి వచ్చే ఉత్తర్వులు, ఇతర లేఖల నిర్వహణకు ప్రత్యేక రిజిస్టర్‌ను నిర్వహించాలని, ప్రతి విభాగాధిపతి సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి కృషి

ప్రజలకు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని అందించే వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి జీఎంసీ కృషి చేస్తుందని, స్థానిక వాకర్స్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు కూడా తోడ్పాటు అందించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. సోమవారం కొరిటెపాడు చెరువు వాకింగ్ ట్రాక్‌ను అధికారులు, స్థానిక వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్‌లు, పార్కుల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని, అభివృద్ధిలో స్థానిక వాకర్స్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. సుమారు 20 ఎకరాల్లో ఉన్న కొరిటెపాడు చెరువులో చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్ణంగా ఉన్నాయని స్థానికుల ఫిర్యాదు మేరకు పరిశీలించామని, త్వరలో పనులు చేపట్టిన అర్బన్ గ్రీనింగ్ కార్పొరేషన్ ప్రతినిధులతో చర్చించి పెండింగ్ పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి ఫిల్టర్‌ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వాకింగ్ ట్రాక్‌లో లైట్లు వెలిగేలా, ట్రాక్‌కి ఏమైనా మరమ్మతులు ఉంటే చేపట్టాలని జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ట్రాక్‌లోని మురుగునీటి శుద్ధి ప్లాంట్ మరమ్మతుకు ప్రతిపాద నలు సిద్ధం చేయా లన్నారు. పర్యటనలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నసాని బాజీ, ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ కోటేశ్వరరావు, జనని సీడ్స్ అధినేత దాసరి శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త సింగంశెట్టి కోటేశ్వరరావు, కార్యదర్శి బెజ వాడ గోపాల కృష్ణారెడ్డి, సిపిఐ నాయకులు కొల్లి రంగారెడ్డి, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ సుందరామిరెడ్డి, ఏడిహెచ్ రామారావు, ఏసీపీ మురళి, ఎంహెచ్‌ఓ ఆనందకుమార్, ఎస్ఎస్ సోమశేఖర్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ శాఖ బదిలీల్లో ప్రతిష్టంభన

● మంత్రి, ప్రిన్సిపల్ సెక్రెటరీ అందుబాటులో లేకపోవడమే కారణం

● ట్రాన్స్‌ఫర్స్ పోర్టల్‌లోకి ఎక్కించి అధికారుల పేర్ల ప్రకటనలో గోప్యత

● ఉత్కంఠగా ఎదురు చూస్తున్న అధికారులు, ఉద్యోగులు

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ అధికారులు, ఉద్యోగుల బదిలీల్లో ప్రతిష్టంభన నెలకొంది. బదిలీలపై సడలించిన నిషేధ ఉత్తర్వులు చివరి రోజు వరకూ ఏ ఒక్కరి బదిలీలను ఆ శాఖ చేపట్టలేదు. చివరి రోజున కొన్ని గంటల్లో నిషేధం తిరిగి అమలులోకి రానుందనగా సూపరింటెండింగ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారులను బదిలీ చేస్తూ రెండు వేర్వేరు ఉత్తర్వులను వెలువరించింది. అయితే వాటిల్లో బదిలీ అయిన అధికారుల పేర్లను గోప్యంగా ఉంచి ఉత్కంఠని మరింత పెంచింది. ఇందుకు కారణం సంబంధిత శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రిన్సిపల్ సెక్రెటరీలు అందుబాటులో లేకపోవడమేనని అధికార వర్గాలు చర్చించుకొంటున్నాయి. మరో రెండు రోజుల్లో ఈ ప్రతిష్టంభన తొలగిపోతుందని పేర్కొంటున్నాయి.

ఉమ్మడి జిలాగా ఉన్న సమయంలో గుంటూరు సర్కిల్ ఎస్ఈ, నాగార్జునసాగర్ కుడికాలువ ఎస్ఈ పోస్టులకు మంచి ఫోకల్ పాయింట్లుగా ఉండేవి. అలానే, కృష్ణా పశ్చిమ డెల్టా ఈఈ, చీరాల, డ్రైనేజీ, రేపల్లె ఈఈ పోస్టులకు కూడా పోటీ తీవ్రంగా ఉండేది. ఎప్పుడైతే గత వైసీపీ ప్రభుత్వం జిల్లాల విభజన చేసి ఎస్ఈ పోస్టులను నీటిపారుదల శాఖ జిల్లా అధికారులుగా మార్చిందో అప్పటి నుంచి వాటికున్న ప్రాధాన్యం తగ్గిపోయింది. పరిధి గణనీయంగా కుంచించుకుపోయింది. గతంలో ఎస్ఈ స్థాయి అధికారులు బాధ్యతలు నిర్వహించిన పోస్టుల్లో నేడు ఈఈలు విధులు నిర్వహిస్తున్నారు. కాగా, రెండున్నరేళ్ల క్రితం గత ప్రభుత్వం నిర్వహించిన బదిలీల ద్వారా వచ్చిన అధికారులే నేటికీ కొనసాగుతున్నారు. దీని దృష్ట్యా త్వరితగతిన బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ఇరిగేషన్ వర్గాలు కోరుకొంటున్నాయి. డీఈ, ఏఈ, హెచ్‌డీ తదితర పోస్టుల్లోనూ బదిలీలు పూర్తి చేయాలని సూచిస్తున్నాయి.


రెవెన్యూలో 29 మంది డీటీల బదిలీ

రెవెన్యూ జిల్లా శాఖలో 29 మంది డిప్యూటీ తహసీల్దార్లను కలెక్టర్ నాగలక్ష్మి బదిలీ చేశారు. బిట్టు రమేష్(గుంటూరు వెస్ట్), వీ.సర్వేశ్వరరెడి (రీసర్వే, గుంటూరు వెస్ట్), ఖాదర్ భేగ్ (సీఎస్‌డీటీ గుంటూరు వెస్టు), టీ.రమాదేవి (గుంటూరు ఈస్టు), బీ.భాస్కరరావు (ఎస్‌డీటీ, గుంటూరు ఈస్టు), వై.ధర్మతేజ (ప్రత్తిపాడు), ఎన్.సతీష్ (రీసర్వే, ప్రత్తిపాడు), ఏ.శివ శంకర్ (సీఎస్‌డీటీ, ప్రత్తిపాడు), టీ.దేవరాజు (ఎస్‌డీటీ, తాడికొండ), కే రాజారమేష్ (పొన్నూరు), ఎం.వెంకటరావు (సీఎస్‌డీటీ,పొన్నూరు), ఎన్.ప్రశాంతి ట(ఫిరంగిపురం), కే.భువనేశ్వరి (మేడికొండూరు), పీ.శిరీష (రీసర్వే, మేడికొండూరు), ఎం.సుభాస్ హెచ్‌ఆర్ శర్మ(తుళ్లూరు), పీ వసంతరావు (రీసర్వే, తుళ్లూరు), కే.ప్రసాద్(పెదకాకాని), కే దినేష్ రాఘవేంద్ర (రీసర్వే, పెదకాకాని), ఏపీ సురేష్‌కుమార్(రీసర్వే, పెదనందిపాడు), షేక్ దరియావలి(వట్టిచెరుకూరు), వీ ప్రశాంతి(కాకుమాను), వీ.కాశీరత్నం (రీసర్వే కాకుమాను), యూ.రాజేష్(కొల్లిపర), ఐ.ప్రశాంతి (రీసర్వే, దుగ్గిరాల), ఎంఎంకే రిజ్వాన్(తాడేపల్లి), ఏ.మోహిని కుమారి (రీసర్వే, తాడేపల్లి), ఎం పద్మజ(స్పెషల్ డీటీ, డీసీఎస్‌వో గుంటూరు), పీ.దుర్గారావు(ఎస్‌డీటీ, డీసీఎస్‌వో గుంటూరు), కే.అపర్ణ(రీసర్వే తాడికొండ వర్కింగ్ ఎరేంజ్‌మెంట్స్‌పై కలెక్టరేట్) బదిలీలు జరిగాయి. వట్టిచెరుకూరు రీసర్వే డీటీ సీహెచ్ అనంతలక్ష్మిని కలెక్టరేట్‌లో వర్కింగ్ ఎరేంజ్‌మెంట్స్‌పై పోస్టింగ్ చేశారు. వీరితో పాటు 26 మంది జూనియర్ అసిస్టెంట్‌లు, 40 మంది సీనియర్ అసిస్టెంట్‌లకు పోస్టింగ్‌లు కల్పించారు. ఇదిలా ఉండగా, గుంటూరు పశ్చిమ మండలం తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు నియమితుడయ్యారు. ఎన్నికల సమయంలో ఆయన మంగళగిరిలో విధులు నిర్వహించినట్లు రెవెన్యూవర్గాలు తెలిపాయి. గత తహసీల్దార్ ఫణీంద్రబాబుని వర్కింగ్ ఎరేంజ్‌మెంట్స్‌పై సీఆర్‌డీఏకి రిలీవింగ్ చేయడంతో పశ్చిమ మండలం ఖాళీ ఏర్పడింది.

నాలుగు వారాల తర్వాత గ్రీవెన్స్ ... పోటెత్తిన బాధితులు

గుంటూరు, సెప్టెంబరు 23 : నాలుగు వారాల అనంతరం సోమవారం జరిగిన గ్రీవెన్స్ కు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రజలు పోలీస్ కార్యాలయానికి పోటెత్తడంతో ప్రత్యేక కౌంటర్ లతో పాటు క్యూలైన్లను ఏర్పాటు చేయిం చారు.

ఆంక్షలపై నిరసన



ఎస్పీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న మీడియా ప్రతినిధులు

మరోసారి మీడియా ప్రతినిధులతో పాటు ప్రజలపై కూడా మరో మారు ఆంక్షల కొరడా విధించారు. పోలీస్ కార్యా లయంలోకి పోలీసులు తప్ప ఇతరుల వాహనాలకు అనుమతి లేదం టూ గేటు బయట బోర్డు పెట్టేశారు. అంతేగాక పోలీస్ సిబ్బందిని మాత్రమే వాహనాలతో అను మతించారు. దీనిపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా చివరకు హెల్మెట్ ఉంటే అనుమతిస్తామంటూ ఏవేవో కుంటి సాకులు చెప్పి ఇత రుల వాహనాలన్నింటిని మెయిన్ రోడ్డు పక్కనే పార్కింగ్ చేయిం చారు. అదే సమయంలో మీడియా ప్రతినిధులకు ప్రవేశం లేదని హెచ్చ రించారు. ఈ విషయాన్ని కొందరు అధికారులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా మీడియా ప్రతినిధులను లోనికి అనుమతించారు. అయితే, అక్కడ మీడియా ప్రతినిధులు ఎవరు బాధితుల వాయిస్ తీసుకోకూడదని, మెయిన్ గేటు బయటకు వెళ్లిన తర్వాత రోడ్డుపై వాయిస్ తీసుకోవాలని ఎస్పీ చెప్పారని స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బీ.సీతారామయ్య ఆంక్షలు విధించారు. ఎటువంటి ఆంక్షలు ఉండవని గతంలో ఎస్పీ స్పష్టం చేసి నెల రోజుల్లోనే మళ్లీ ఆంక్షలేమిటని ప్రశ్నించిన మీడియా ప్రతినిధులు పోలీస్ కార్యాలయంలోనే నిరసన వ్యక్తం చేశారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పీతో చర్చించిన అనంతరం మీడియా ప్రతినిధులకు ఎటువంటి ఆంక్షలు లేవని, బాధితులకు అసౌకర్యం కలగకుండా బాధితుల వాయిస్ తీసుకోవచ్చని సీతారామయ్య చెప్పారు. పోలీస్ కార్యాలయానికి వచ్చే సామాన్యప్రజలపై ఆంక్షలు కొనసాగించారు.

ఆప్షన్-1, 2 ఇళ్లను వేగవంతంగా పూర్తి చేయాలి

● వచ్చే ఏడాది మార్చికి 100 శాతం లక్ష్యం అధిగమించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హౌసింగ్ లే అవుట్లు, సొంత స్థలాల్లో మంజూరు చేసిన ఇళ్లలో ఆప్షన్ 1, 2 విభాగంలో నిర్మిస్తున్న ఇళ్ళను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. 'మన ఇల్లు మన గౌరవం', 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలపై మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, హౌసింగ్ అధికారులతో సోమవారం కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'మన ఇల్లు, మన గౌరవం' నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేలా సంబంధిత శాఖల అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో పట్టణ, గ్రామీణప్రాంతాల్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన తొలి దశలో మంజూరు చేసిన ఇళ్లలో దాదాపు 28,730 గృహాలు ఆప్షన్ 1, 2లలో లబ్ధిదారులు నిర్మించుకుంటుకుంటున్నారని, వీటిలో ఇప్పటి వరకు 11,000 మాత్రమే పూర్తయినట్లు తెలిపారు. ఆప్షన్ 1,2లలో శ్లాబ్ లెవల్ పూర్తయిన ఇళ్లను అక్టోబరు నాటికి, ఫౌండేషన్ స్థాయిలో ఉన్న వాటిని 2025 మార్చి నాటికి లబ్ధిదారులతో పూర్తి చేయించే లక్ష్యంతో ఈ కార్యక్రమంను ప్రభుత్వం నిర్వహిస్తోందని అన్నారు. పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్ల వారీగా, మండల, పంచాయతీ, గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఈ నెల 24, 25 తేదీలలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీ వోలు, తహశీల్దార్లు, హౌసింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాల న్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై 26న గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో స్పెషల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులు సమావేశం నిర్వహించాలన్నారు. లే అవు ట్‌లో మంజూరు చేసిన ఆప్షన్ 1,2 లబ్ధిదారులతో 28వ తేదీ ఉదయం 10 గంటలకు, సొంత స్థలాల్లో మంజూరు చేసిన ఆప్షన్ 1, 2 లబ్ధిదారులతో 3 గంటలకు సదస్సులు నిర్వహించి, వేగవంతంగా ఇళ్లు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మొదటి ఫేజ్‌లో మంజూరు చేసిన ఇళ్లను 2025 మార్చి నాటికి ఖచ్చితంగా పూర్తిచేసుకోవాలని, నిర్దేశిత సమయం దాటిన తరువాత ఇంటి నిర్మాణ నిమిత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయం అందించటం కుదరదని లబ్ధిదారులకు స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు.

స్వర్ణాంధ్ర-2047లో భాగస్వాములు కావాలి

స్వర్ణాంధ్ర-2047 క్యూఆర్ కోడ్


గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 రూపకల్పనలో భాగ స్వాములు అవుతూ సూచనల అందించాలని జిల్లా ప్రజా నీకానికి కలెక్టర్ ఎస్ నాగ లక్ష్మి విజ్ఞప్తి చేశారు. తాము విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ని స్మార్ట్ ఫోన్ ద్వారా స్కాన్ చేసి స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళిక రూపకల్పనలో భాగస్వాములు కావా లన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర-2047 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసికొని సూచనలు, అభి ప్రాయాలను నమోదు చేయాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యో గస్తులను కోరారు. దేశానికి స్వాతంత్ర్యము వచ్చి 2047 నాటికి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్రప్రభుత్వం వికసిత్ భారత్ 2047 రూపొందిస్తోందన్నారు. దీనిలో భాగముగా స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారంచుట్టిందన్నారు. ప్రజల భాగస్వామ్య సంప్రదింపు కాలము సెప్టెంబరు 21 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేసీ ఏ.భార్గవతేజ, ట్రైనీ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, డీఆర్‌వో పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, గుంటూరు ఆర్‌డీవో శ్రీకర్, సీపీవో శేషశ్రీ, డీఈఓ శైలజ, హౌసింగ్ పీడీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఎస్పీకు ప్రజా సంఘాల వినతి

గుంటూరు, సెప్టెంబరు 23: నగరంలో నానాటికి జటిలంగా మారుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీని ప్రజా సంఘాల నాయకులు జూపూడి శ్రీనివాసరావు, జీఆర్ భగత్‌సింగ్, పీవీ రమణయ్య పలువురు నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా ఓరుగంటి సరోజనమ్మ సంతాప సభ

● డీజీపీ, రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు నివాళి



సరోజనమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీజీపీద్వారకా తిరుమలరావు, పక్కన డాక్టర్ ఓవీ రమణ

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 23: గుంటూరు నగరానికి చెందిన ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ ఓవీ రమణ తల్లి సరోజినమ్మ (94) సంతాప సభ సోమవారం జరిగింది. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సంతాప సభలో రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీ ఎలమంచిలి శివాజీ, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, భాష్య సంస్థల అధి నేత భాష్యం రామకృష్ణ, మాజీ ఉడా ఛైర్మన్ వణుకూరి శ్రీనివాస రెడ్డి, డిప్యూటీ కమిషనర్ తుమ్మల వెంకట కృష్ణయ్య బిఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సురేష్ కృష్ణ, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసిన శంకర్రావు, సీతారామయ్య హై స్కూల్ పూర్వ విద్యార్థులు, డాక్టర్ రమణ, బాల్యమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూ వ్యవహారంలో దోషులను కఠినంగా శిక్షించాలి

గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కోట్లాదిమంది హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ లడ్ల కుంభకోణానికి పాల్పడిన తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసరావు కోరారు. కొరిటెపాడులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ప్రసాదంలో జంతు కొవ్వు కలవడం దురదృష్టకరం

గుంటూరు, సెప్టెంబర్ 23: తెలుగువారు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించే వెంకటేశ్వరస్వామి తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తులకు పంపిణీ చేసే లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు, చేప నూనె వంటివి కలవడం దురదృష్టకరమని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు జీ.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం లాడ్జి కూడలి లోని జనసేనపార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సామాజిక సంస్కరణ కవి జాషువా

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 23: సామాజిక సంస్కరణ కోసం కవిత్వం రాసిన గొప్ప సామాజిక కవి గుర్రం జాషువా అని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాదు అన్నారు. సోమవారం హిందూ కళాశాల న్యూ సెమినార్ హాల్లో జాషువా 129వ జయంతి ఉత్సవాలు జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం హిందూ కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాదును జాషువా కళాపీఠం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 27: కార్మికులను కట్టు బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం స్థానిక హిమనీ సెంటర్ వద్ద కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

నేడు ఉచిత కాలేయ పరీక్షల శిబిరం

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 23: మహాత్మగాంధీ ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని భాష్యం రామసేతు క్యాంపస్ వెనుక గల శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉచితంగా కాలేయ పరీక్షల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో నాడీ పరీక్షలు చేసి మందులు సూచిస్తామని తెలిపారు.

ఇంకో 75 రోజుల్లో పుష్ప రూల్



'పుష్ప ద రూల్'.. భారతీయ సినీపరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా ఇది. అల్లు అర్జున్ నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం మరో 75 రోజుల్లో అంటే డిసెంబర్ 6న విడుదల కానుంది. అంటే పుష్ప రూల్‌కు కౌంట్ డౌన్ మొదలైందన్నమాట. అల్లు అర్జున్ నటన కోసం, దర్శకుడు సుకుమార్ టేకింగ్, మేకింగ్ కోసం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. కంటెంట్ పరంగానే కాకుండా సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత స్థాయిలో ఉంటుందని నిర్మాతలు నవీన్ యర్నేని, రవిశంకర్ చెప్పారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు, టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిందనీ, ఇక వచ్చే ప్రతి ప్రమోషనల్ కంటెంట్ అదిరిపోయే రీతిలో ఉంటుందని వారు తెలిపారు. రశ్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

టిక్కెట్ ధర పెంపునకు ప్రభుత్వ అనుమతి



జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న దేవర సినిమా ఈ నెల 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో దేవర సినిమా టిక్కెట్ల ధరలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. అంతేకాదు మిడ్ నైట్ షోలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మిడ్ నైట్ షోలు ఆడించేందుకు 29 థియేటర్లకు అనుమతించింది. ఈ మేరకు హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా రిలీజ్ రోజున ఆరు షోలు ఆడించేందుకు థియేటర్లకు అనుమతి ఇచ్చారు. మరుసటి రోజు నుంచి అక్టోబరు 6 వరకు రోజుకు 5 షోలు ఆడించుకునే వెసులు బాటు కల్పించారు. తొలిరోజు టిక్కెట్ ధరలను రూ. 100 పెంచుకునేందుకు అనుమతించారు. సింగిల్ స్క్రీన్‌లలో టిక్కెట్‌పై రూ. 25, మల్టీప్లెక్స్‌లో రూ. 50 పెంచుకునే అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ సినిమాకు టికెట్ రేటు పెంచే సదుపాయం అక్కడి ప్రభుత్వం కల్పించిన సంగతి విదితమే.

అమెరికా వెళ్లిన ఎన్టీఆర్

జూనియర్ ఎన్టీఆర్ తన సతీమణి ప్రణతీతో కలసి అమెరికా బయలుదేరారు. లాస్‌ఏంజిల్స్‌లోని బియాండ్‌ఫెస్ట్‌లో ఈ నెల 26 సాయంత్రం జరిగే దేవర స్క్రీనింగ్‌కి హాజరు కానున్నారు. అలాగే అక్కడ కొన్ని మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇవ్వనున్నారు.




మహేశ్‌బాబు, నమ్రత శిరోద్కర్ సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. వరద బాధితుల సహాయార్థం ప్రకటించిన రూ.50 లక్షల చెక్కును సీఎంకు అందజేశారు. అలాగే ఎ.ఎమ్.బి తరపున మరో రూ. 10లక్షల చెక్కును కూడా మహేశ్‌బాబు అందజేశారు

సెట్‌లో దర్శకుడి బర్త్ డే



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' అనేది ట్యాగ్ లైన్. సీనియర్ ప్రొడ్యూసర్ బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం నేపాల్‌లో జరుగుతోంది. ఇప్పటికి ఎనభై శాతం చిత్రం పూర్తయిందనీ, ఫ్రెష్ కామెడీతో లాఫింగ్ రైడ్‌లా సినిమా ఉంటుందని నిర్మాత చెప్పారు. సోమవారం దర్శకుడు భాస్కర్ పుట్టినరోజు కావడంతో సెట్‌లో సెలబ్రేట్ చేశారు. ప్రకాశ్‌రాజ్, హీరోయిన్ వైష్ణవి తదితరులు కూడా పాల్గొన్నారు.

చారిత్రక యోధుడి పాత్రలో తొలిసారి!



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ మళ్లీ ముఖానికి మేకప్ వేసుకుని కెమెరా ముందుకు వచ్చారు. ఆయన తొలిసారిగా చారిత్రక యోధుడి పాత్ర పోషిస్తున్న 'హరి హర వీరమల్లు' సినిమా తాజా షెడ్యూల్ సోమవారం ఉదయం విజయవాడలో మొదలైంది. కళా దర్శకుడు తోట తరణి రూపొందించిన భారీ సెట్‌లో యుద్ధ సన్నివేశాన్ని దర్శకుడు జ్యోతికృష్ణ చిత్రీకరిస్తున్నారు. హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ నిక్ పావెల్ సారథ్యంలో జరుగుతున్న ఈ చిత్రీకరణలో నాజర్, రఘుబాబు, అయ్యప్ప పి.శర్మ, సునీల్ తదితరులతో పాటు ఫైటర్లు, జూనియర్ ఆర్టిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. నిధి అగర్వాల్ చిత్ర కథానాయిక కాగా, బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.వచ్చే ఏడాది మార్చి 28న 'హరిహర వీరమల్లు' పార్ట్ వన్ విడుదలవుతుందని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. పవన్‌కల్యాణ్‌ను సరికొత్తగా చూడబోతున్నామని ఈ పోస్టర్‌తో హామీ ఇచ్చారు దర్శకనిర్మాతలు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రాన్ని ఎ.ఎం.రత్నం సమర్పణలో ఎ.దయాకరరావు చెప్పారు,

ఆ వీధికి నాన్న పేరు పెట్టండి

స్టాలిన్‌కు ఎస్పీ చరణ్ వినతి



గానగంధర్వుడు, సినీ నేపథ్యగాయకుడు దివంగత ఎస్.పి.బాలసుబ్రమణ్యం నివసించిన కామ్‌దార్‌నగర్‌కు ఆయన పేరును పెట్టాలని ఎస్పీబీ తనయుడు, సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ .చరణ్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం చెన్నై సచివాలయం ప్రాంగణంలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్ సెల్‌లో వినతిపత్రం సమర్పించారు. ఇందులో.. 'సంగీత ప్రపంచంలో తన మధురమైన గాత్రంతో కోట్లాదిమంది అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జీవించివున్న సమయంలో స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసివుండేవారు. ప్రస్తుతం ఆయన భౌతికంగా లేకపోవడంతో ఆయనను స్మరించుకునేలా ఎస్పీబీ నివసించిన కామ్‌దార్‌నగర్‌కు 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నగర్ లేదా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వీధి'గా నామకరణం చేయాలని కోరుతున్నాను. ఈ వినతిని పెద్దమనసుతో అంగీకరించి, తమతో పాటు కోట్లాదిమంది ఎస్పీబీ అభిమానుల కోరికను తీర్చాలని కోరుతున్నాం' అని ఎస్పీ చరణ్ కోరారు. కాగా, ఈ నెల 25వ తేదీన ఎస్పీబీ నాలుగో వర్థంతి వేడుకలు జరుగనున్న విషయం తెల్సిందే.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

ఆస్కార్‌కి వెళ్తున్న లాపతా లేడీస్

వచ్చే ఏడాది జరిగే ఆస్కార్ అవార్డుల వేడుకకు ఇండియా నుంచి వెళ్లే సినిమా ఖరారైపోయింది. ఆ చిత్రమే.. బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ మాజీ భార్య.. 'ధోబీ ఘాట్' ఫేమ్ కిరణ్ రావు దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్'. 2025 సంవత్సరానికిగాను ఉత్తమ విదేశీ చిత్రాల జాబితాలో మన దేశం నుంచి అధికారిక ఎంట్రీగా 'లాపతా లేడీస్' చిత్రాన్ని నామినేట్ చేస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఐ) ఛైర్మన్ జహ్ను బారువా ఇతర నిర్వాహకులు రవి కొట్టార్కర, సి.కళ్యాణ్ తదితరులతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ ఏడాది ఆస్కార్ నామినేషన్ల కోసం తెలుగు, తమిళం, మలయాళం, మరాఠీ, హిందీ భాషలకు చెందిన 29 చిత్రాలను 13 మందితో కూడిన కమిటీ సభ్యులు షార్ట్‌లిస్ట్‌చేయగా, అందులో 'లాపతా లేడీస్'ను అధికారిక ఎంట్రీగా సభ్యులంతా ఎంపిక చేసినట్టు జహ్ను బారువా వెల్లడించారు. కాగా, మార్చి ఒకటిన విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక అవార్డులనూ పొందింది.



అలాగే, భారతదేశ అత్యున్నత న్యాయస్థానం 75వ వార్షికోత్సవాల్లోనూ ఆ చిత్రాన్ని ప్రదర్శించడం విశేషం. కొత్తగా పెళ్లైన ఓ గ్రామీణ జంట జీవితాల్లో జరిగిన అనూహ్య సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. వారు ఎదుర్కొన్న అనేక సమస్యలను ఇందులో మనసుకు హత్తుకునేలా తెరకెక్కించడమే ఈ చిత్ర విజయానికి కారణం. ఈ సినిమాతో పాటు తెలుగు చిత్రసీమ నుంచి 'కల్కి 2898 ఏడీ', 'హను-మాన్', 'మంగళవారం' చిత్రాలు.. బాలీవుడ్ నుంచి 'యానిమల్', 'కిల్', 'శ్రీకాంత్', 'ఆర్టికల్ 370', 'మైదాన్'.. మలయాళం నుంచి నేషనల్ అవార్డ్ విన్నర్ "ఆట్టమ్', 'ఆడు జీవితమ్', 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్'.. తమిళ్ నుంచి 'వాజీ', 'మహరాజా' వంటి 29 చిత్రాలు పోటీ పడ్డాయి.

నమ్మకం నిజమైంది

'లాపతా లేడీస్' ఆస్కార్‌కు ఎంపికైనందుకు దర్శకురాలు కిరణ్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఈ చిత్రం ఆస్కార్‌కు నామినేట్ అవుతుందని ఇంతకుముందే ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. నా నమ్మకం నిజమైంది. సినిమా కోసం అహర్నిశలు శ్రమించిన మా చిత్రబృందానికి దక్కిన గుర్తింపు ఇది. భారత్‌లో ఈ సినిమాను ఎలా ఆదరించారో.. అంతర్జాతీయంగానూ అంతే ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అని అన్నారు.




అన్నయ్య హగ్ చేసుకున్నాడు



తమిళ నటుడు కార్తీ నటించిన తాజా చిత్రం 'సత్యమ్ సుందరమ్'. '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మించారు. అరవింద స్వామి కీలక పాత్ర పోషించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా హీరో కార్తీ మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా స్క్రిప్ట్‌ను చదవగానే నా కళ్ల వెంట ఆనందభాష్పాలు వచ్చాయి. అద్భుతమైన మానవ విలువలు ఉన్న కథ ఇది. ఈ కథను మొదట దర్శకుడు నవలగా తీసుకువద్దామని రాసుకున్నారు. అదృష్టవశాత్తు ఇది సినిమాగా తెరకెక్కింది. ఇందులో నాది అమాయకత్వం.. చలాకీతనం కలగలసిన క్యారెక్టర్. సున్నితమైన భావోద్వేగాలతో నిండిన ఫీల్ గుడ్ చిత్రమిది. నా పాత్ర, అరవింద స్వామి పాత్ర గుర్తుండిపోతాయి. '96' చిత్రంలాగే.. ఈ సినిమా కథ కూడా ఒక్క రాత్రిలోనే జరుగుతుంది. గ్రామీణ జీవితాన్ని.. మన సంప్రదాయాల్ని.. మూలాల్ని తిరిగి గుర్తుచేసేలా ఉండే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. గోవింద్ వసంత్ అందించిన మ్యూజిక్ చాలా వినసొంపుగా ఉంటుంది. ప్రతీ పాట అర్థవంతంగా ఉండి హృదయాల్ని కదిలిస్తుంది. ప్రేక్షకులకు రియల్ ఎమోషన్స్‌ను పరిచయం చేసే ఇలాంటి చిత్రాలు రావడం చాలా అరుదు. ఈ సినిమాను చూసిన అన్నయ్య సూర్య చేసుకుని హగ్ చేసుకుని ప్రశంసించారు. నా మొదటి సినిమా తర్వాత ఇన్నేళ్లకు అన్నయ్య అంతలా ఎక్సైట్ అయిన చిత్రమిదే" అని చెప్పారు.



సంక్రాంతి బరిలో మరో సినిమా



వచ్చే సంక్రాంతికి విడుదలయ్యే సినిమాల జాబితాలో మరో పేరు చేరింది. సందీప్‌కిషన్ హీరోగా నటిస్తున్న 30వ సినిమా అది. ఈ చిత్రానికి 'మజాకా' అనే పేరు నిర్ణయించారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, రిలీజ్ టైమ్ ఒకేసారి విడుదల చేసి ప్రమోషన్స్ ప్రారంభించారు నిర్మాత.

ఇన్ ప్రోగ్రెస్

నీ జతగా



ప్రముఖ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ హీరోగా నటిస్తున్న 'మిస్టర్ సెలబ్రిటీ' చిత్రంలోని మెలోడీ సాంగ్‌ను హీరో గోపీచంద్ విడుదల చేసి కొత్త హీరోకు, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'నీ జతగా' అంటూ సాగే ఈ పాటను గణేశా రచించగా, జావెద్ అలీ పాడారు. వినోద్ యాజమాన్య సంగీత దర్శకుడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. చందిన రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు ఈ సినిమాను నిర్మించారు.

కుతంత్రమే ఆమె మంత్రం



విష్ణు మంచు హీరోగా డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రం నుంచి నటి ఐశ్వర్య పోషిస్తున్న మారెమ్మ పాత్రకు సంబంధించిన లుక్‌ను సోమవారం విడుదల చేశారు. అందరినీ భయపెట్టే విధంగా ఈ లుక్ ఉంది. 'అడవిని పీడించే అరాచకం.. మారెమ్మ, కుతంత్రమే ఆమె మంత్రం' అంటూ రిలీజ్ చేసిన పోస్టర్ అందరినీ ఆకట్టుకునే విధంగా ఉంది. డిసెంబర్‌లో విడుదలయ్యే ఈ పాన్ ఇండియా మూవీకి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు.

ఏఐ మ్యూజిక్‌తో 'ఐ వాంట్ లవ్'



డైరెక్టర్ ఆర్జీవీ బ్యానర్‌పై గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'శారీ'. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రవి వర్మ నిర్మిస్తున్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలోని మొదటి గీతం 'ఐ వాంట్ లవ్'ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "ఈ సినిమాలోని మొత్తం పాటలను ఏ.ఐను ఉపయోగించే కంపోజ్ చేశాము. నేపథ్య సంగీతానికి కూడా ఏ.ఐతోనే ముందుకు వెళ్తాం. ఇకపై 'ఆర్జీవీ మ్యూజిక్ డెన్' నుంచి వచ్చే ప్రతీ పాటలో ఏ.ఐ యాప్స్‌తో తయారు చేసిన సంగీతం మాత్రమే ఉంటుంది" అని చెప్పారు.

ఐఐటీ తిరుపతిలో ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ

దిక్సూచి DIKSUCHI



తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ తిరుపతి)- ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రెగ్యులర్(ఫుల్ టైమ్ స్కాలర్స్), ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్ విధానంలో ఎంపికైన అభ్యర్థులకు వివిధ స్కీమ్‌ల ద్వారా అసిస్టెంట్‌షిప్ లభిస్తుంది. ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ విధానాల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఉద్యోగులై ఉండాలి. కనీసం రెండేళ్ల అనుభవం; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు/జాతీయ స్థాయి ల్యాబొరేటరీల నుంచి స్పాన్సర్‌షిప్ తప్పనిసరి.

ఎంఎస్(రీసెర్చ్)

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్

అర్హత: ఇంజనీరింగ్/టెక్నాలజీ బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ(ఎమ్మెస్సీ/ఎంసీఏ)తో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

పీహెచ్‌డీ

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఇంజనీరింగ్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ లేదా డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 8 సీజీపీఏతో ఐఐటీ నుంచి(జామ్ ద్వారా ప్రవేశం పొంది ఉండాలి) రెండేళ్ల ఎమ్మెస్సీ; సీఎఫ్‌టీఐ సంస్థ నుంచి బీఎస్+ఎంఎస్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్) ఉత్తీర్ణులైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్సెస్ విభాగాలకు సెంట్రల్ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఎస్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాలకు సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ/డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. యూజీసీ నెట్ లేదా జేఆర్ఎఫ్/గేట్ స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.400; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** నవంబరు 5 నుంచి 18 వరకు
- **క్యాంపస్ రిపోర్టింగ్:** డిసెంబరు 2
- **వెబ్‌సైట్:** https://iittp.ac.in

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు, కౌన్సిలర్ రామయ్య తదితరులు

పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం కావాలి

● పురపాలక సంఘ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 21: పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం కావాలని పట్టణ పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. నందులపేట 25వ వార్డులో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవ 2024 కార్యక్రమాలలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పట్టణాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ప్రతి ఒక్కరి సహకారంతోనే స్వచ్ఛ తెనాలి, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధ్యమన్నారు. అనంతరం 4వ వార్డు, 12వ వార్డులో జరుగుతున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను పర్యవేక్షించి, విద్యార్థులతో స్వచ్ఛత అవగాహన ర్యాలీని నిర్వహించారు. మున్సిపల్ అధికారులకు, సిబ్బంది పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ బి.శేషన్న, అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, ఎంఈ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, వెంకటేశ్వరరావు, కొర్రా యశోద, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, శానిటేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు

తెనాలి రూరల్, సెప్టెంబరు 23: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారులకు తెలిపి పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న ప్రజాసమస్యల ప్రజా వేదికకు ఆరు అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. అందులో సర్వే కోసం మూడు అర్జీలు రాగా అడంగల్‌కు మరో మూడు వచ్చాయన్నారు. తమ కార్యాలయానికి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చూస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు.



నరసింహరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్వరలయ వేదిక సభ్యులు

స్థానం నరసింహరావుకు ఘన నివాళి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23: స్త్రీ పాత్రలకు స్థానం నరసింహరావు జీవం పోశారని, సంగీత దర్శకుడిగా ఆయన ఎన్నో మధుర గీతాలకు బాణీని సమకూర్చారని స్వరలయ వేదిక అధ్యక్షుడు సాయి లక్కరాజు శ్లాఘించారు. వేదిక కార్యాలయంలో సోమవారం ఆయన జయంతి పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శృంగార రసానికి ప్రతిబింబమైన సత్యభామ, చింతామణి, దేవదేవి, మధురవాణి వంటి పాత్రలు పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సీఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు, పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, హేమంత్, రమేష్ పాల్గొన్నారు.



వల్లభాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధ్యం

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, సెప్టెంబరు 23: పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వల్లభాపురంలో అధికారులు, సచివాలయం సిబ్బంది స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో అధికారులు, సచివాలయం సిబ్బంది, కార్మికులు ర్యాలీ నిర్వహించి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అదేవిధంగా మండలంలోని గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించి పారిశుధ్య పనులు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో పరిపాలనాధికారి చంద్రమోహన్, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు, మండల కో-ఆర్డినేటర్ మర్రెడ్డి వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో సాల్మన్‌రాజు

ఎండీఎంపై హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కొల్లిపర, సెప్టెంబరు 23: మధ్యాహ్న భోజనం పథకంపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని పిడపర్రు, కొల్లిపర, దావులూరిపాలెం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో ఆకస్మికగా తనిఖీచేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏజెన్సీ నిర్వాహకులు ఆ జాగ్రత్త వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలల్లో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

కోర్టు తీర్పుపై హర్షం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23: పిల్లలు చట్టప్రకారం పోర్న్ వీడియోలు చూడటం డౌన్‌లోడ్ చేయడం నేరమని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని ఏపీ మా అధ్యక్షుడు దిలీప్ రాజా హర్షం వ్యక్తం చేశారు. సోమవారం తెనాలిలో విలేకర్లతో మాట్లాడుతూ, ఈ అంశంపై చెన్నై కోర్టు ఇచ్చిన తీర్పును ఒక తండ్రి సుప్రీం కోర్టులో అప్పీలు చేశారని చెప్పారు. దేశ ఆచార సాంప్రదాయాలను గౌరవిస్తూ పిల్లల రక్షణ కోసం ఈ కోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఆరెమండ తపాలా కార్యాలయంలో నిధుల గోల్‌మాల్

● ఖాతాదారుల సొమ్ము ఖాతాల్లో జమచేయకుండా సొంతానికి వినియోగించుకున్న పోస్టల్ సిబ్బంది

● విచారణలో నిర్ధారించుకున్న అధికారులు



ఆరెమండ తపాల శాఖ కార్యాలయం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 23: ఆరెమండ తపాలశాఖ కార్యాలయంలో ఖాతాదారుల నగదు డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాలలో నగదు గోల్‌మాల్‌పై సోమవారం ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణ నిర్వహించారు. ఆరెమండ తపాల శాఖ కార్యాలయం పరిధిలో ఆరెమండ గాయంవారిపాలెం, దండమూడి గ్రామాలు ఉన్నాయి. తపాల శాఖ కార్యాలయంలో ఓ యువతి కొద్ది నెలల క్రితం విధుల్లో చేరారు. సదరు యువతి పోస్టాఫీస్‌కు వచ్చే వృద్ధులు, పలువురు ఖాతాదారులు తమ నగదును పోస్టాఫీసులో జమ చేయటానికి వచ్చినప్పుడు పోస్టాఫీసు సర్వర్లు పనిచేయటం లేదని తర్వాత నమోదు చేస్తానని ఖాతాదారుల నుంచి రెండు నెలలుగా నగదు వసూళ్ళకు పాల్పడినట్లు ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. రెండు నెలలుగా తమ ఖాతాలో నగదు జమ కాకపోవటం, ఉద్యోగి సరైన సమాధానం ఇవ్వకపోవటంతో ఖాతాదారులు పోస్టల్‌శాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.



విచారణ చేసేందుకు వచ్చిన బాపట్ల ఏపీఎస్ మల్లేశ్వరరావు

ఖాతాదారుల సమాచారం మేరకు బాపట్ల పోస్టల్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మల్లేశ్వరరావు సిబ్బందితో సహా సోమవారం ఆరెమండ పోస్టాఫీసుకు వచ్చి విచారణ చేశారు. ఖాతాదారులను పోస్టాఫీసు వద్దకు రప్పించి వారి ఖాతా వివరాలను, కార్యాలయంలోని నగదు, జమ చెల్లింపుల వివరాలను సరిపోల్చి చూశారు. అయితే ఖాతాదారుల పుస్తకాలలో సరైన నగదు జమ వివరాలు లేకపోవటంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న యువతిని కార్యాలయానికి పిలిపించి వివరణ కోరారు. అధికారుల విచారణలో ఖాతాదారుల నుంచి నగదు తీసుకుని రికార్డులో జమ చేయలేదని యువతి అంగీకరించినట్లు సమాచారం. దీనిపై అసిస్టెంట్ సూపరింటెండెంట్ మల్లేశ్వరరావును వివరణ కోరగా ఖాతాదారుల ఆరోపణల మేరకు విచారణ నిర్వహించినట్లు చెప్పారు. ఖాతాదారులందరినీ పిలిపించి విచారణ చేపడుతున్నట్లు చెప్పారు. ప్రాథమికంగా చేసిన విచారణ సందర్భంగా ఇప్పటివరకు రూ.5లక్షల వరకు నిధులు స్వాహా అయినట్లు గుర్తించామని మిగిలిన విచారణ జరిపి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందచేసి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనునట్లు చెప్పారు.

ఆర్టీసీ బస్సు డిపోకు 100 ఫస్ట్ ఎయిడ్ కిట్లు వితరణ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23: పట్టణానికి చెందిన శ్రీసాయిమంగ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కె.రమేష్‌కుమార్ 100 ఫస్ట్ ఎయిడ్ కిట్లను తెనాలి ఆర్టీసీ బస్సు డిపోకు అందజేశారు. సోమవారం బస్సు డిపోలో జరిగిన కార్యక్రమంలో మేనేజర్ రాజశేఖర్‌కు ఈ కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు, సిబ్బంది రమేష్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. మేనేజర్ మాట్లాడుతూ, రీజియన్‌లో రూ.19 లక్షల లాభంతో ఏకైక డిపోగా తెనాలి ఆర్టీసీ నిలబడిందన్నారు. డిపోకు మరో పది కొత్త బస్సులు రానున్నాయని చెప్పారు. ప్రతి బస్సులో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను ఏర్పాటు చేసేందుకు సహకారం అందించిన దాతను అభినందించారు. బస్సు స్టేషన్‌లో కొంత వరకు సీసీ రోడ్డు వేశామని, మొత్తం ఆవరణ వాన కాలంలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రోడ్లను పూర్తి చేసే పనులు చేపట్టామన్నారు. ఐజే ప్రసాదరావు, నాయక్, శ్రీనివాసరావు, అసోసియేషన్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.



దాతను సన్మానిస్తున్న మేనేజర్ రాజశేఖర్

తహసీల్దార్ కార్యాలయంలో బదిలీలు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 23: పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందిని బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెంట్ పనిచేస్తున్న ఐ ప్రశాంతిని దుగ్గిరాల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా, ఫిరంగిపురం డిప్యూటీ తహసీల్దార్ రాజారమేష్ మోహన్‌ను పొన్నూరు సూపరింటెంట్‌గా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణను ప్రత్తిపాడు, గుంటూరు కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఎం.శ్రీనివాస్‌ను పొన్నూరు ఆర్‌ఐగా, జూనియర్ అసిస్టెంట్ పోతురాజును బాపట్లకు, బాపట్ల జూనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావును పొన్నూరుకు, పొన్నూరు సీనియర్ అసిస్టెంట్ ఎన్ వెంకయ్యను పల్నాడు జిల్లాకు, డీఎస్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న రామారావును పొన్నూరు సీనియర్ అసిస్టెంట్‌గా, పొన్నూరు ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఆనందరావును బాపట్లజిల్లాకు బదిలీ చేశారు. గుంటూరు ఆర్డీవో కార్యాలయ ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ హసన్ అహ్మద్‌ను పొన్నూరుబదిలీ చేశారు. సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ భువనేశ్వరిని మేడికొండూరుకు, వట్టిచెరుకూరులో పనిచేస్తున్న వెంకట్రావును పొన్నూరు సీఎస్‌డీటీగాబదిలీచేశారు. అయితే తహసీల్దార్‌గా ఎవరినీ నియమించలేదు. గత రెండు నెలలుగా తహసీల్దార్ లేకపోవటంతో పొన్నూరు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిడుబ్రోలులో 'ఇది మంచి ప్రభుత్వం'

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 23: సుపరిపాలన అందించటమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్ బాబు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు వార్డులో సోమవారం జరిగింది. అలాగే మండల పరిధిలోని మామిళ్లపల్లి, చింతలపూడి, వడ్డిముక్కల, నండూరు తదితర గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలు, వార్డులో ఇంటింటికి వెళ్లిన టీడీపీ నాయకులు వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ముంద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా రాబోయే రోజులో ప్రభుత్వం చేసే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పొన్నూరు పట్టణ, మండల టీడీపీ నాయకులు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైసీపీ నేతల వ్యాఖ్యలు దుర్మార్గం

తెనాలిరూరల్, సెప్టెంబరు 23: తిరుపతి లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందని నివేదికలు వెల్లడిస్తుంటే వైసీపీ నేతలు మాత్రం పంది కొవ్వు ధరలపై లెక్కలు తీయటం దుర్మార్గమని, వారి తీరు భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఉందని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ నేత వీరవల్లి మురళి సోమవారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామి వారి లడ్డు ప్రసాదానికి వినియోగించే నెయ్యి కిలో రూ.320కి వస్తుందని అయితే లడ్డు ప్రసాదంలో కల్తీచేశారని భావిస్తున్న పందికొవ్వు కిలో రూ.1400 పలుకుతుందంటూ కోట్లాదిమంది భక్తులను అవహేళన చేసేలా వైసీపీ తొత్తుల వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకంగా ఉన్నాయని విమర్శించారు. హేయమైన వ్యాఖ్యలను ఇకనైనా ఆపకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మురళి హెచ్చరించారు.

విద్యార్థి దశ నుంచే అప్రమత్తంగా ఉండాలి

తెనాలి క్రైం, సెప్టెంబరు 23: విద్యార్థి దశలోనే తప్పటడుగు పడితే భవిష్యత్ అంధకారంగా మారుతుందని రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని గుప్తా కళాశాలలో నిర్వహించిన వారధి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొందరు విద్యార్థులు అమాయకత్వంతోనే, కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టామనే ఉత్సాహంతోనే తప్పటడుగులు వేస్తుంటారన్నారు. సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమింగ్, తెలియని ఆన్‌లైన్ లింకులు ఓపెన్ చేయడం వంటివి చేసి, మోసపోతుంటారని, ఇటువంటి ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి. పలువురు సరదాగా గంజాయికి అలవాటుపడి చివరికి దానికి బానిసలుగా మారి జీవితానికి ముగింపు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు జీవిత లక్ష్యాలు సాధించేందుకు సరైన బాటలో నడవాలన్నారు. త్రీ టౌన్ సీఐ రమేష్ మాట్లాడుతూ, మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, విన్యాసాలు చేస్తూ ప్రాణాల మీదకి తెచ్చుకుని, తల్లిదండ్రులకు జీవితాంతం శోకాన్ని కలిగిస్తున్నారు. జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకున్న వారే అసలైన హీరోలన్నారు. కార్యక్రమంలో టూ టౌన్ సీఐ నిస్సార్‌భాషా, ప్రతాప్‌కుమార్, కళాశాల అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పుపాలక సంఘం గ్రీవెన్స్‌కు మూడు ఆర్జీలు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 23: పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం అసిస్టెంటు మున్సిపల్ కమీషనర్ లక్ష్మీపతిరావు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 3 ఆర్జీలు అందినట్లు కమీషనర్ కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటణలో తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి ఒకటి, ఇంజనీరింగ్ విభాగానికి రెండు ఆర్జీలు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించేలా కృషిచేస్తామని కమిషనర్ తెలిపారు.



చేబ్రోలు స్వర్ణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రాయశ్చిత్త పూజలో పాల్గొన్న జనసేన నాయకులు

తిరుమల లడ్డు అపవిత్రం క్షమించరాని నేరం

● జనసేన నాయకులు

చేబ్రోలు, సెప్టెంబరు 23: తిరుమల తిరుపతి దేవస్థానంలో పరమపవిత్రంగా భావించే స్వామివారి లడ్డూ ప్రసాదంలో కల్తీచేసి నెయ్యిని వాడి అపవిత్రం చేయటం క్షమించరాని నేరం అని జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల లడ్డు ప్రసాదం అపవిత్రం చేసారంటూ జనసేన నాయకులు సోమవారం గాలిగోపురం సమీపంలోని స్వర్ణవెంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రాయశ్చిత్త పూజలు చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్న సందర్భంగా సంఘీభావంగా ఈ పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం విశిష్టతను కాపాడాలని సనాతన ధర్మం పరిరక్షణ కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఉమ్మినేని శివయ్య, నారిశెట్టి కృష్ణయ్య, షరీఫ్, గోవాడ మొహనరావు, ముసలా శ్రీనివాసరావు, ప్రతాప్, తాళ్లూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా పాలన

● పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

● ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తెనాలి పట్టణంలో పర్యటన



చిరువ్యాపారుల యోగక్షేమాలు తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

తెనాలిరూరల్, సెప్టెంబరు 23: ప్రజలందరూ ఆకాంక్షిస్తున్నట్లు రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో తీర్చిదిద్ది భావితరాల బంగారు భవిష్యత్తుకు బాటవేసేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంత్రి మనోహర్ పర్యటించి ప్రజల యోగక్షేమాలును విచారించారు. వందరోజుల ప్రభుత్వ పాలనలో అమలు చేసిన కార్యక్రమాలను వివరించి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో తెనాలి పట్టణంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేసిందేలేదన్నారు. దాని ఫలితంగా చిన్నపాటి వర్షంకురిస్తే రోడ్లు జలమయంగా మారి పారిశుధ్యం లోపించి దోమలు వృద్ధిచెంది ప్రజలకు అనేక సమస్యలు ఉత్పన్నమయ్యేవని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెనాలి ప్రాంతంలో ఐదేళ్లుగా తీయని కాలువల పూడికలను యుద్ధప్రాతిపదికన తీయించామని, దాని ఫలితంగా వర్షం కురిసిన గంటల వ్యవధిలోనే నీరు బయటకు వెళ్లి రోడ్లు పూర్వస్థితికి చేరుతున్నాయన్నారు. మునిసిపాలిటీ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు కాలువలపై పర్యవేక్షణ ఉంచి వ్యర్థాలను తొలగిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల క్షేమాన్ని కాంక్షించేదని నిరూపించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను సైతం కన్నీరు పెట్టించిందని పంటల సాగుకు అవసరమైన నీరు అందించే పంట కాలువలు, డ్రెయిన్లను సైతం పట్టించుకోకపోవడంతో అధిక వర్షాల కారణంగా పంటల్లో నీరు బయటకు వెళ్లేదారి లేక చేతికొచ్చిన పంటలు నీటిలో నాని రైతులకు అపారనష్టం వాటిల్లిందన్నారు. దీంతో పంటలు నష్టపోయి రైతులు పుట్టెడుదుఃఖంలో ఉంటే కనీసం అప్పటినేతలు వారిని ఓదార్చి ధైర్యం చెప్పే పరిస్థితి లేకుండా దుర్మార్గంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టి ప్రజలందరి మన్ననలు పొందేలా కూటమి పాలన కొనసాగనుందని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు. పలు శాఖల అధికారులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 23: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సోమవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చెంచుపేటలోని పద్మావతి కళ్యాణమండపం రోడ్డులో సుమారు 35 సంవత్సరాల వ్యక్తి మృతి చెంది ఉండటం గమనించిన స్థానికులు త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు సమాచారమిచ్చారని తెలిపారు. అ వ్యక్తి మృతదేహాన్ని జిల్లా వైద్యశాల శవగారంలో భద్రపరిచామని తెలిపారు. మృతి చెందిన వ్యక్తి కాషాయి రంగుపైన బ్లూ చారలు కలిగిన టీ షర్ట్, సిమెంటు రంగుల డిజైన్ కలిగిన లుంగీ ధరించి ఉన్నాడన్నారు. వివరాలు తెలిసిన వారు తెనాలి త్రీ టౌన్ పోలీసు స్టేషన్ (08644- 228417) ఎస్సై (7013099095), ఇన్‌స్పెక్టర్ (94407 96274) లకు సమాచారమివ్వాలని కోరారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీక్షకు


జనసైనికుల సంఘీభావం

పెదకాకాని, సెప్టెంబర్ 23: ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్తదీక్షకు సంఘీభావంగా పెదకాకాని వేణుగోపాలస్వామి ఆలయంలో జనసేన నేతలు సోమవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నేత సిద్దు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యివాడి ఆలయ అపవిత్రత మూటగట్టిందన్నారు. ఇందుకుగానూ పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా రాష్ట్రం అంతటా జనసేన నాయకులు, సంఘీభావ కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో బండారు శ్రీనివాసరావు, మునగ గోపీచంద్, గుమ్మాల. శివన్నారాయణ, కాటం వెంకట్రావు కంకణాల గోపిశంకర్, పుప్పాల రాంబాబు తడవర్తి. అప్పారావు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్ షిప్ పోటీలలో

తెనాలి క్రీడాకారుల ప్రతిభ

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 23: రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో తెనాలి క్రీడాకారుల ప్రతిభ చాటారు. స్థానిక చెంచుపేటలోని యూనిక్ టైక్వాండో అకాడమీలో సోమవారం రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షప్ పోటీలలో స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులను అకాడమీ కోచ్ నాగరాజు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల ఇండోర్ స్టేడియంలో ఈ నెల 22వ తేదిన జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో వివిధ విభాగాలలో స్వర్ణ పతకాలను అకాడమీ క్రీడాకారులు సాధించారని కోచ్ నాగరాజు తెలిపారు. ఈ పోటీలలో బ్లాక్ బెల్ట్ కేటగిరి సీనియర్ అండర్ 74 కేజిల విభాగంలో కంభం వినయ్, అండర్ 69 కేజీల విభాగంలో రాయుడు వీరేంద్ర స్వర్ణ పతకాలను సాధించారని తెలిపారు. వీరు డిసెంబరు 22వ తేదిన జరగబోవు నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలకు ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవాధ్యక్షుడు బాల చంద్రమౌళి, క్రీడాకారులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ నాగరాజు



మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న కమిషనర్ రమేష్ బాబు

ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు: కమిషనర్

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 23: ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. పొన్నూరు పట్టణంలోని 31వ వార్డులో అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. పొన్నూరు పట్టణంలోని ప్రజలతో పాటు పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తునట్లు చెప్పారు. పారిశుధ్యం మెరుగుపడితే ప్రజారోగ్యం కూడా మెరుగు పడుతుందన్నారు. పట్టణంలో వీధులవెంట చెత్త చెదారాలు తొలగించటంతోపాటు, మురుగు కాల్వలో సిల్ట్ తొలగింపు పనులు చేపట్టామన్నారు. దోమల నివారణ చర్యలు చేపడుతునట్లు చెప్పారు. అలాగే ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ ఆశీలు రూ.2.50లక్షలు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 23: పొన్నూరు పట్టణంలోని కొప్పాక వెంకయ్య కూరగాయల మార్కెట్ ఆశీలు వేలం సోమవారం జరిగింది. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా ఆరు నెలల కాలానికి రూ.2.50 లక్షలు ఆశీలు వసూలుకు దాసరి విజయ్‌కుమార్ సొంతం చేసుకున్నారు. వేలంలో పట్టణానికి చెందిన పలువురు పాల్గొన్నారు.